# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...



విలేకరులు కావలెను
http://vaasthavanestham.com
వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...
సంప్రదించండి
తెలంగాణ 8099779988
ఆంధ్రప్రదేశ్ 9985337979
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో
వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన
- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను



సంపుటి : 2 సంచిక : 266 శనివారం 20 ఏప్రిల్ 2024 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


# కేసీఆర్ కాలం చెల్లింది



- కారు షెడ్డుకు పోయింది..
- సీఎం రేవంత్ వ్యంగ్యాస్త్రాలు
- "మా ఎమ్మెల్యేలను కంచె వేసి కాపాడుకుంటాం. ఇక్కడున్నది రేవంత్ రెడ్డి.
- ఈ సాయంత్రానికి నీ దొడ్లో ఎంతమంది ఎమ్మెల్యేలు ఉంటారో లెక్క పెట్టుకో"
- నన్ను ముట్టుకుంటే మాడిపోతారు...
- 10 ఏళ్ల రాష్ట్రంలో కేసీఆర్, కేంద్రంలో మోదీ పాలమూరుకు చేసిందేమీ లేదు
- మోదీ, ఫాంహౌస్ కేడీ తెలంగాణను దోపిడీ చేశారు.. సీఎం రేవంత్ విసుర్లు
- దిగిపో దిగిపో అంటున్నావ్... ఉత్తగ వచ్చామా బిడ్డా
- మరో పదేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుంది
- ఆగష్టు 15వ తేదీలోగా రైతులకు రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేస్తాం
- రైతులకు రూ. 500 బోనస్ ఇస్తామని హామీ

**మహబూబ్‌నగర్/మహబూబాబాద్**

కేసీఆర్ కాలం చెల్లిందని.. కారు షెడ్డుకు పోయిందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. 20 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని కేసీఆర్ చేసిన వ్యాఖ్యలకు సీఎం రేవంత్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. "మా ఎమ్మెల్యేలను కంచె వేసి కాపాడుకుంటాం. ఇక్కడున్నది రేవంత్ రెడ్డి. ఈ సాయంత్రానికి నీ దొడ్లో ఎంతమంది ఎమ్మెల్యేలు ఉంటారో లెక్క పెట్టుకో" అని కేసీఆర్‌కి రేవంత్ సవాల్ విసిరారు. మహబూబ్‌నగర్ జిల్లాలో సీఎం రేవంత్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మరికాసేపట్లో మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీ చందర్ రెడ్డి నామినేషన్ వేయనున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీ తీశారు. ఈ సభలో బీఆర్ఎస్, బీజేపీపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. 2009 లోక్‌సభ ఎన్నికల్లో కేసీఆర్‌ను పాలమూరు ప్రజలు గెలిపించారని.. గెలిపిస్తే ఆయన ఏం చేశారని ప్రశ్నించారు. కృష్ణానది పక్కనే ప్రవహిస్తున్న పాలమూరులో కేసీఆర్ ఎందుకు ప్రాజెక్టులు కట్టలేదని నిలదీశారు. విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో సహకరించలేదన్నారు. -మిగతా3లో



## ప్రత్యేక రాష్ట్రం కోసం డిమాండ్

- నాగాలాండ్‌లోని ఆరు జిల్లాల్లో జీరో ఓటింగ్
- నాగాలాండ్‌లోని ఒకే లోక్‌సభ స్థానానికి శు క్రవారం ఒకే దశలో పోలింగ్
- ఫ్రాంటియర్ నాగాలాండ్ టెరిటరీ (ఎఫ్ఎన్‌టీ)ని ఏర్పాటు చేయాలని ఈఎన్‌పీవో 2010 నుంచి డిమాండ్

# కాంగ్రెస్ వైఫల్యాలను ఎత్తిచూపుతూ..



- బీర్ఎస్ పార్టీకి పూర్వవైభవం తీసుకురావడమే ధ్యేయం
- కేసీఆర్ బస్సు యాత్ర షెడ్యూల్ ఖరారు
- ఏప్రిల్ 22 నుంచి మే 10వ తేదీ వరకు బస్సు యాత్ర
- తమ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల ముందుకు తీసుకెళ్లే యోచనలో గులాబీ బాస్
- అలాగే కాంగ్రెస్, బీజేపీ వైఫల్యాలను కూడా ఎత్తిచూపాలని ప్రణాళిక

**హైదరాబాద్**

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టనున్న బస్సు యాత్ర షెడ్యూల్ ఖరారైంది. ఈ నెల 22 నుంచి మే 10వ తేదీ వరకు తెలంగాణ వ్యాప్తంగా కేసీఆర్ బస్సు యాత్ర చేపట్టనున్నారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా బస్సుయాత్రకు శ్రీకారం చుట్టబోతున్నారు. ఏప్రిల్ 22వ తేదీ నుంచి మే 10వ తేదీ వరకు తాజాగా ఈ బస్సు యాత్ర షెడ్యూల్ ఖరారైంది. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల ముందుకు తీసుకెళ్లే యోచనలో గులాబీ బాస్ ఉన్నారు. అలాగే కాంగ్రెస్, బీజేపీ వైఫల్యాలను కూడా ఎత్తిచూపనున్నారు. ప్రస్తుతం -మిగతా3లో



# డూప్లికేట్ ఓట్లపై ఫోకస్..

- ఈసీ కీలక నిర్ణయం
- నగరంలో రికార్డు స్థాయిలో డూప్లికేట్ ఓట్లు ఉన్నట్లు ఎన్నికల సంఘం గుర్తింపు
- తెలంగాణలో ఉన్న 33 లక్షల ఓటర్లను తొలగించింది
- ప్రధానంగా హైదరాబాద్ జిల్లాలో 5 లక్షల డూప్లికేట్ ఓట్లు తొలగింపు
- గత రెండేళ్లలో దాదాపు 60.6 లక్షల మంది కొత్త ఓటర్లు
- సీఈఓ వికాస్ రాజ్ ఒక ప్రకటన

**హైదరాబాద్:**

లోక్‌సభ ఎన్నికల వేళ ఎలక్షన్ కమిషన్ డూప్లికేట్ ఓట్లపై ఫోకస్ పెట్టింది. హైదరాబాద్ నగరంలో రికార్డు స్థాయిలో డూప్లికేట్ ఓట్లు ఉన్నట్లు ఎన్నికల సంఘం గుర్తించింది. ఈ క్రమంలో తెలంగాణలో ఉన్న 33 లక్షల ఓటర్లను తొలగించింది. ప్రధానంగా హైదరాబాద్ జిల్లాలో 5 లక్షల డూప్లికేట్ ఓట్లు తొలగించినట్లు ఈసీ పేర్కొంది. హైదరాబాద్‌లో అత్యధికంగా జూబ్లీహిల్స్, చాంద్రాయణగుట్టలో డూప్లికేట్ ఓట్లు ఉన్నట్లు ఈసీ గుర్తించింది. ఇక.. రాష్ట్ర వ్యాప్తంగా గత రెండేళ్లలో 32.8 లక్షల మంది ఓటర్లను -మిగతా3లో

# బీఆర్ఎస్ కాంగ్రెస్ రెండు అవినీతి పార్టీలే




- ఖమ్మం రోడ్ షోలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు
- తెలంగాణ ఏర్పాటు కోసం, అభివృద్ధి కోసం ప్రజలు ఆశించారు
- బీఆర్ఎస్ అవినీతి ప్రభుత్వాన్ని ప్రజలు తరిమికొట్టారు
- మోదీ ప్రభుత్వం మాటలు ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం
- 'కాంగ్రెస్ కాలం చెల్లిపోయింది
- దేశ రాజకీయాల్లో తన ఉనికిని కోల్పోయింది

**ఖమ్మం/హైదరాబాద్**


పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతోంది తెలంగాణ బీజేపీ. జాతీయ పెద్దలతో ఎన్నికల ప్రచారం నిర్వహించేలా ప్రణాళిక రూపొందించింది. ఇందులో భాగంగానే ఖమ్మం జిల్లాలో నిర్వహించిన రోడ్‌షోలో కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు. బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్ రావు విజయాన్ని కాంక్షిస్తూ ఎన్నికల ప్రచారంలో రాజ్ నాథ్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాటు కోసం, అభివృద్ధి కోసం ప్రజలు ఆశించారని.. బీఆర్ఎస్ అవినీతి ప్రభుత్వాన్ని ప్రజలు తరిమికొట్టారన్నారు. బీఆర్ఎస్ కాంగ్రెస్ రెండు అవినీతి పార్టీలే అని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం మాటలు ప్రభుత్వం కాదని.. చేతల ప్రభుత్వమని స్పష్టం చేశారు. జమ్ము కాశ్మీర్ 369 ఆర్టికల్ లాంటి కీలకమైన నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. బీజేపీ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా అయోధ్యలో రామ మందిరం ఏర్పాటు చేశామని చెప్పారు. త్రిపుల్ తలాక్ ఎత్తేశామని... మహిళలకు గౌరవం ఉండాలని -మిగతా3లో

# ప్రతిపక్షాలకు తమను విమర్శించడానికి ఏమీ లేదు



- ఎన్నికల బాండ్ల స్కీమ్: రాహుల్‌గాంధీకి అమిత్ షా స్ట్రాంగ్ కౌంటర్
- ఎన్నికల బాండ్ల స్కీమ్ అతిపెద్ద ఎక్స్‌టార్షన్ స్కీమ్ అయితే కాంగ్రెస్‌కూడా ఈ స్కీమ్ కింద అక్రమ వసూళ్లకు పాల్పడిందని
- తాము కూడా ఈ స్కీమ్ కింద వసూళ్లు చేశామని రాహుల్ ప్రజలకు చెప్పాలి
- ఎంపీల సంఖ్య ప్రకారం చూస్తే ప్రతిపక్షాలే అత్యధికంగా ఎన్నికల బాండ్ల స్కీమ్‌లో లాభపడ్డాయి

# ఈడీ తీరు హాస్యాస్పదం..




**న్యూఢిల్లీ :** తనకు తీహార్ జైల్లోనైనా డయాబెటీస్ ఇన్సులిన్ ఇవ్వాలని కోరుతూ ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ రౌస్ అవెన్యూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై విచారణ చేపట్టిన కోర్టు తీర్పును రిజ్వర్‌లో ఉంచింది. ఏప్రిల్ 22న తీర్పును వెలువరించనుంది. మద్యం పాలసీ కేసులో తీహార్ జైలులో ఉన్న కేజ్రీవాల్ గత కొన్నేళ్లుగా తీవ్ర మధుమేహంతో బాధపడుతున్నారు. మధుమేహం కారణంగా బ్లడ్ షుగర్ లెవెల్ పడిపోతున్నాయని, ట్రీట్మెంట్ తీసుకునేందుకు వైద్యుల వీడియో కన్సల్టేషన్ కావాలని ఇప్పటికే పలు మార్లు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన కోర్టు కేజ్రీవాల్ విజ్ఞప్తిని తిరస్కరిస్తూ వచ్చింది.

**కేజ్రీవాల్‌పై కుట్ర**

అయితే కేజ్రీవాల్‌కు ఇన్సులిన్ ఇవ్వకపోవడంపై ఆయన కుటుంబ సభ్యులు,ఆప్ పార్టీ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇన్సులిన్ ఇవ్వకుండా కేజ్రీవాల్‌ను చంపేందుకు జైల్లో కుట్రజరుగుతోందని ఆప్ నేత అతిషి సంచలన ఆరోపణలు చేస్తున్నారు.

**కోర్టులో కేజ్రీవాల్ మరో పిటిషన్**

ఈ తరుణంలో తనకు ఇన్సులిన్ ఇవ్వాలని కోరుతూ కేజ్రీవాల్ రౌస్ అవెన్యూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిగింది. విచారణ సందర్భంగా కేజ్రీవాల్ తరుపు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ ఈడీ చేస్తున్న ఆరోపణల్ని ఖండించారు.

**ఈడీ ఆరోపణల్ని తోసుపుచ్చిన న్యాయవాది**

కేజ్రీవాల్ జైలులో కేవలం మూడుసార్లు మామిడి పండ్లను తిన్నారని, నవరాత్రి ప్రసాదంగా ఆలూ పూరీని సేవించారని కోర్టుకు తెలిపారు. మెడికల్ బెయిల్ పొందేందుకు ఆప్ అధినేత హై షుగర్ లెవల్స్ ఎక్కువగా ఉన్న ఆహారాన్ని తీసుకుంటున్నారన్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆరోపణలను తోసిపుచ్చారు.

**మూడు మామిడి పండ్లే తిన్నది**

కేజ్రీవాల్ డయాబెటిక్ పేషెంట్ కాబట్టి ఇన్సులిన్ వేసుకునేందుకు అనుమతించాలన్న అభ్యర్థనపై సింఘ్వీ కోర్టులో మాట్లాడుతూ.. కేజ్రీవాల్ ఇప్పటి వరకు 48 సార్లు ఇంటి నుంచి పంపిన భోజనం చేశారు. గ్లైసెమిక్ ఇండెక్స్ వ్యాల్యూ ఆధారంగా మూడు మామిడి పండ్లను మాత్రమే తిన్నారు. మామిడి (51) ,వైట్ రైస్ (73) లేదా బ్రౌన్ రైస్ (68) కంటే తక్కువగా ఉంది అని సింఘ్వీ కోర్టులో వాదించారు. కేజ్రీవాల్ షుగర్ లెవెల్స్ ఎక్కువగా ఉన్న స్వీట్లను తింటున్నారన్న ఈడీ ఆరోపణలపై సంఘ్వీ స్పందించారు. సీఎం ఆరుసార్లు షుగర్ లేని స్వీట్లు తిన్నారని, షుగర్ లేకుండా టీ తాగేవారని, షుగర్ ఫ్రీ ట్యాబ్లెట్లను వాడారని ఆయన అన్నారు.

**హాస్యాస్పందంగా ఈడీ తీరు**

మామిడి పండ్లు తిని మెడికల్ బెయిల్ తీసుకునేందుకు కేజ్రీవాల్ ప్రయత్నిస్తున్నాంటూ ఈడీ చేసిన వ్యాఖ్యలు అత్యంత హాస్యాస్పదంగా ఉన్నాయని సింగ్వీ అన్నారు. విచారణ సందర్భంగా కేజ్రీవాల్ నేరస్థుడా? గ్యాంగ్‌స్టరా? సంఘ్వీ ప్రశ్నించారు. ఆయన ఇప్పటి వరకు 15 నిమిషాల వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వైద్యుల సాయంతో ట్రీట్మెంట్ తీసుకోలేక పోయారని విచారం వ్యక్తం చేశారు. ఓసారి మీరే వైద్యులు కేజ్రీవాల్‌కు సూచించిన ఆహారాన్ని చూడండి. ఇందులో తియ్యని పండ్లు, లేదా ఇతర తీపి పదార్థాల గురించి ప్రస్తావించలేదు' అని కోర్టుకు విన్న వించుకున్నారు. ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు తీర్పును ఏప్రిల్ 22న వెలవరించనుంది.

# భారతీయులు అనవసర ప్రయాణాలు వద్దు..



**అబుదాబీ:** దుబాయిని భారీ వర్షాలు వణికిస్తున్న వేళ.. అక్కడికి వెళ్లాలనుకుంటున్న భారతీయులకు యూఏఇలోని భారత రాయబార కార్యాలయం హెచ్చరిక జారీ చేసింది. అత్యవసరమైతే తప్పా దుబాయికి రావాలనే ఆలోచన మానుకోవాలని శుక్రవారం సూచించింది. ఇందుకు సంబంధించి ప్రకటనను జారీ చేసింది. భారీ వర్షాలతో అతలాకుతలమైన జన జీవనాన్ని సాధారణ స్థితికి తేవడానికి యూఏఇ అధికారులు నిత్యం పని చేస్తున్నారు. రద్దైన, దారి మళ్లించిన విమానాల లిస్టును అధికారులు విడుదల చేశారు. దుబాయి ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో భారతీయ పౌరులకు సహాయం చేయడానికి, కాన్సులేట్ జనరల్ ఆఫ్ ఇండియా ఏప్రిల్ 17న అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్‌లను విడుదల చేసింది.

**ఆకుపచ్చగా ఆకాశం..**

ఎడారి దేశం దుబాయిను తీవ్ర తుఫాన్ అతలాకుతలం చేసింది. ఆకస్మిక భారీ వర్షాలకు రోడ్లు, షాపింగ్ మాల్స్, విమానాశ్రయం, రన్ వేలు మొదలైనవన్నీ నీటితో నిండిపోయాయి. గత 75 ఏళ్లలో దుబాయిలో నమోదైన అత్యంత భారీ వర్షపాతం ఇదే. ఈ వరదల కారణంగా నగరంలో భారీ నష్టం సంభవించింది. ఈ తీవ్ర తుఫాన్ సమయంలో అక్కడ చోటు చేసుకున్న వాతావరణ మార్పులు అత్యంత భయంకరంగా ఉన్నాయి. ఆ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తుపాను కమ్మేస్తున్న సమయంలో ఆకాశంలో భారీ మార్పులు చోటు చేసుకున్నాయి. సెకన్ల వ్యవధిలోనే ఆకాశం ఆకుపచ్చగా మారిపోయింది. విపరీతమైన గాలులు కమ్మేశాయి. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సినిమాలో గ్రాఫిక్స్ తరహాలో క్షణాల్లోనే అంతా మారిపోయి కుంభవృష్టి మొదలైంది.

అక్కడ సాధారణంగా ఏడాదికి 200 మి.లీ. వర్షం మాత్రమే కురుస్తుంది. అలాగే వేసవిలో ఉష్ణోగ్రత 50 డిగ్రీలు దాటేస్తుంది. కానీ ఇప్పుడు రికార్డులు తిరగరాసే వర్షపాతం నమోదవుతుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

# ఇండియా కూటమి ఏర్పాటులో కీలక పాత్ర పోషించా



**కలకత్తా:** ఇండియా కూటమిలోని కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ మండిపడ్డారు. బెంగాల్‌లో వారు బీజేపీతో జత కలిశారని ఆరోపించారు. ఇక్కడ ఇండియా కూటమి ఉనికిలో లేదని వ్యాఖ్యానించారు. ముర్షిదాబాద్ ఎన్నికల ప్రచార ర్యాలీలో ఆమె మాట్లాడుతూ... ఈ లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ లేదా సీపీఐ(ఎం)కు ఓటు వేయవద్దని సూచించారు. బెంగాల్లో మాత్రం ఆ పార్టీలు బీజేపీ కోసం పని చేస్తున్నట్లుగా ఉందని ఆరోపించారు. ప్రతిపక్ష కూటమి ఏర్పాటులో తాను కీలక పాత్ర పోషించానని... ఇండియా కూటమి అని పేరు కూడా తాను పెట్టానని గుర్తు చేశారు. మీరు బీజేపీని ఓడించాలనుకుంటే కాంగ్రెస్, సీపీఐ(ఎం)లకు అనుకూలంగా ఓటు వేయవద్దని సూచించారు. రాష్ట్రంలో శ్రీరామనవమి వేడుకల సందర్భంగా బీజేపీ హింసను ప్రేరేపించిందని ఆరోపించారు. ముర్షిదాబాద్‌లో హింస ముందస్తు ప్లాన్‌తో జరిగిందన్నారు. మమతా బెనర్జీ ఆరోపణలపై బీజేపీ తీవ్రంగా స్పందించింది. బెంగాలీ హిందువులను రక్షించడంలో ఆమె విఫలమైందని మండిపడ్డారు. ముర్షిదాబాద్ జిల్లాలో జరిగిన రామనవమి వేడుకల సందర్భంగా జరిగిన హింసకు మమతా బెనర్జీ బాధ్యత వహించాలని డిమాండ్ చేసింది.

**కాంగ్రెస్‌పై మమతా బెనర్జీ సంచలన ఆరోపణలు**

ఎన్నికల ప్రచారంలో మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈసారి ఆమె ఇండియా కూటమి పార్టీలు కాంగ్రెస్, వామపక్షాలపైనే విరుచుకుపడ్డారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీతో కలిసి కాంగ్రెస్, వామపక్షాలు తృణమూల్ కాంగ్రెస్‌పై కుట్ర పన్నుతున్నాయని ఆరోపించారు. అసలు ఇండియా కూటమిని ఏర్పాటు చేసిందే తానని, కూటమికి ఇండియా అనే పేరు కూడా తానే పెట్టానన్నారు. ఇంత చేస్తే పశ్చిమ బెంగాల్‌లో కాంగ్రెస్ బీజేపీ కోసం పనిచేస్తోందని మండిపడ్డారు. 'రాష్ట్రంలో బీజేపీని ఓడించాలంటే కాంగ్రెస్,వామపక్షాలకు ఎవరూ ఓటు వేయకండి'అని మమత పిలుపునిచ్చారు. కాగా,లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమిలో భాగంగా తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీల మధ్య పశ్చిమబెంగాల్‌లో పొత్తు కుదరలేదు. సీట్ల పంపకం ఒప్పందం కుదరకపోవడం వల్లే ఒంటరిగా పోటీ చేయాల్సి వచ్చిందని తృణమూల్ ప్రకటించింది.

## ఎన్నికల వేళ కాషాయరంగులోకి దూరదర్శన్ లోగో.. దుమ్మెత్తిపోస్తున్న విపక్షాలు

**ఎరుపు రంగు నుంచి కాషయంలోకి డీడీ లోగో**

**రంగు మారినా ప్రాధామ్యంలో మార్పు ఉండబోదని డీడీ వివరణ**

**వార్తల ప్రసారం విషయంలో తమకు ధైర్యం ఉందన్న డీడీ**

**చివరికి డీడీనీ వదల్లేదంటూ బీజేపీపై విపక్షాల మండిపాటు**





ఎన్నికల వేళ ప్రభుత్వ టెలివిజన్ బ్రాడ్‌కాస్టర్ దూరదర్శన్ తన లోగో రంగును మార్చడం వివాదాస్పదమైంది. డీడీ న్యూస్ లోగోను ఎరుపు నుంచి కాషాయరంగులోకి మార్చింది. ఈ నెల 16 నుంచే మారిన లోగో చానల్‌లో కనిపిస్తోంది. లోగో రంగు మారినప్పటికీ తమ ప్రాధామ్యాల విషయంలో మాత్రం ఎలాంటి తేడా ఉండదని దూరదర్శన్ తన సోషల్ మీడియా వేదికగా పేర్కొంది. గతంలో ఎన్నడూ లేని విధంగా వార్తల ప్రయాణానికి సిద్ధంగా ఉండాలని, డీడీ వార్తలను సరికొత్తగా అనుభవించాలని కోరింది. వేగంపై కచ్చితత్వం, క్లెయిమ్స్‌పై వాస్తవాలు, సంచలనాత్మక నిజాలకు సంబంధించిన వార్తల ప్రసారం విషయంలో తమకు ధైర్యం ఉందని పేర్కొంది. ఎందుకంటే డీడీ న్యూస్‌లో ప్రసారమైతే అది నిజమని ఆ పోస్టులో పేర్కొంది. అయితే, రంగుమార్పుపై విపక్షాలు మండిపడుతున్నాయి. బీజేపీ కాషాయీకరణ దూరదర్శన్‌కూ మారిందని దుమ్మెత్తిపోస్తున్నాయి. దూరదర్శన్ ప్రస్తుతం ఆరు జాతీయ చానళ్లను, 17 ప్రాంతీయ చానళ్లను కలిగి ఉంది. నేషనల్ చానళ్లలో డీడీ నేషనల్, డీడీ ఇండియా, డీడీ కిసాన్, డీడీ స్పోర్ట్స్, డీడీ ఉర్దూ, డీడీ భారతి వంటి జాతీయ చానళ్లు.. డీడీ అరుణ్ ప్రభ, డీడీ బంగ్లా, డీడీ బీహార్, డీడీ చందన, డీడీ గిర్నార్, డీడీ మధ్యప్రదేశ్, డీడీ మలయాళం, డీడీ నార్త్ఈస్ట్, డీడీ ఒడిశా, డీడీ పొదిగై, డీడీ పంజాబ్, డీడీ రాజస్థాన్, డీడీ సహ్యగిరి, డీడీ సప్తగిరి, డీడీ ఉత్తరప్రదేశ్, డీడీ యాదగిరి, డీడీ కశ్మీర్ వంటి ప్రాంతీయ చానళ్లు వున్నాయి.

## మీ కొడుక్కి ఓటేయకపోయినా... కనీసం ఆశీర్వదించండి కాంగ్రెస్ నేత ఆంటోనీకి రాజ్‌నాథ్ సింగ్ విజ్ఞప్తి

**పథనంథిట్టలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఏకే ఆంటోనీ కుమారుడు**

**ఆంటోనీ ఇబ్బందిని అర్థం చేసుకోగలనన్న రాజ్‌నాథ్ సింగ్**

**ఆయనపై కాంగ్రెస్ ఒత్తిడి ఉందని వ్యాఖ్య**



'మీ కొడుక్కి ఓటు వేయకపోయినా... కనీసం తండ్రిగా ఆశీర్వదించండి' అని కాంగ్రెస్ సీనియర్ నేత ఏకే ఆంటోనీకి కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ విజ్ఞప్తి చేశారు. ఆంటోనీ తనయుడు అనిల్ ఆంటోనీ కేరళలోని పథనంథిట్ట నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఈ నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఏకే ఆంటోనీ గారూ... మీకు ఓ విషయం చెప్పాలనుకుంటున్నా... మీరు మీ కుమారుడికి ఓటు వేయకపోయినా పర్లేదు.. కనీసం ఆశీస్సులైనా అందించండని పేర్కొన్నారు. కొన్ని రోజుల క్రితం ఆంటోనీ చేసిన వ్యాఖ్యలు తనకు ఆశ్చర్యం కలిగించాయ న్నారు. ఆంటోనీ ఇబ్బందిని అర్థం చేసుకోగలనని... కాంగ్రెస్ ఒత్తిడి వల్ల అలా మాట్లాడి ఉండవచ్చునన్నారు. ఇటీవల ఏకే ఆంటోనీ మాట్లాడుతూ... బీజేపీ నుంచి పోటీ చేస్తున్న తన కొడుకు ఓడిపోవాలని, ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి గెలవాలని తాను కోరుకుంటున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీయే తన మతం అని వెల్లడించారు. ప్రస్తుత ఎన్నికలు భారత్, దాని రాజ్యాంగ పరిరక్షణకు సంబంధించినవని వ్యాఖ్యానించారు. తన తండ్రి వ్యాఖ్యలపై అనిల్ అంటోనీ కూడా ఘాటుగానే స్పందించారు. కాంగ్రెస్ పార్టీలో కాలంచెల్లిన నేతలు ఉన్నారని... తన తండ్రి పరిస్థితిని చూస్తే జాలేస్తోందని పేర్కొన్నారు.

## ప్రత్యేక రాష్ట్రం కోసం డిమాండ్..




**కోహిమా:** నాగాలాండ్‌లోని ఒకే లోక్‌సభ స్థానానికి శుక్రవారం ఒకే దశలో పోలింగ్ జరిగింది. అయితే, ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ నేపథ్యంలో కొన్ని ప్రాంతాల ప్రజలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. దీంతో నాగాలాండ్‌లోని ఆరు జిల్లాల్లో జీరో ఓటింగ్ నమోదైంది. ఫ్రాంటియర్ నాగాలాండ్ టెరిటరీ (ఎఫ్ఎన్‌టీ)ని ఏర్పాటు చేయాలని తూర్పు నాగాలాండ్ పీపుల్స్ ఆర్గనైజేషన్ (ఈఎన్‌పీవో) 2010 నుంచి డిమాండ్ చేస్తున్నది. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ దీనిపై స్పందించకపోవడంపై ఏడు గిరిజన సంఘాలతో కూడిన ఈ సంస్థ లోక్‌సభ ఎన్నికలను బహిష్కరించాలని పిలుపునిచ్చింది. ఎన్నికల ప్రచారం కోసం ఏ రాజకీయ పార్టీని అనుమతించబోమని పేర్కొంది. అలాగే 20 అసెంబ్లీ సీట్లున్న ఆరు జిల్లాల్లో పబ్లిక్ ఎమర్జెన్సీ ప్రకటించింది. కాగా, ఈ ఆరు జిల్లాల్లో సుమారు నాలుగు లక్షలకుపైగా ఓటర్లు ఉన్నారు. దీంతో 738 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతోపాటు భారీగా బందోబస్తు ఉంచారు. అయితే తూర్పు నాగాలాండ్ పీపుల్స్ ఆర్గనైజేషన్ (ఈఎన్‌పీవో) నిరసన పిలుపునకు ఆరు జిల్లాల ప్రజల మద్దతిచ్చారు. ప్రత్యేక రాష్ట్రం డిమాండ్‌కు సంఘీభావంగా పోలింగ్ రోజున ఇంట్లోనే ఉండిపోయారు. దీంతో మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆరు జిల్లాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి ఓటింగ్ నమోదు కాలేదని ఎన్నికల అధికారి తెలిపారు.

## ప్రతిపక్షాలకు తమను విమర్శించడానికి ఏమీ లేదు



**గాంధీనగర్:** లోక్‌సభ ఎన్నికల వేళ ఎన్నికల బాండ్లపై నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. గుజరాత్‌లోని గాంధీనగర్ నుంచి నామినేషన్ వేసిన సందర్భంగా శుక్రవారం కేంద్ర హోం శాఖ మంత్రి ఎన్నికల బాండ్లపై మాట్లాడారు. ఎన్నికల బాండ్ల స్కీమ్‌ను ప్రపంచంలోనే అతిపెద్ద ఎక్స్‌టార్షన్(అక్రమ వసూళ్లు) స్కీమ్‌గా అభివర్ణించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి అమిత్ షా గట్టి కౌంటర్ ఇచ్చారు. ఎన్నికల బాండ్ల స్కీమ్ అతిపెద్ద ఎక్స్‌టార్షన్ స్కీమ్ అయితే కాంగ్రెస్‌కూడా ఈ స్కీమ్ కింద అక్రమ వసూళ్లకు పాల్పడిందని ఆరోపించారు. తాము కూడా ఈ స్కీమ్ కింద వసూళ్లు చేశామని రాహుల్ ప్రజలకు చెప్పాలి. ఎంపీల సంఖ్య ప్రకారం చూస్తే ప్రతిపక్షాలే అత్యధికంగా ఎన్నికల బాండ్ల స్కీమ్‌లో లాభపడ్డాయన్నారు. ప్రతిపక్షాలకు తమను విమర్శించడానికి ఏమీ లేదని, ఇందుకే ప్రజలను కావాలని గందరగోళానికి గురిచేస్తున్నాయన్నారు. కాగా, ఎన్నికల బాండ్ల స్కీమ్ కింద బీజేపీ అక్రమ వసూళ్లకు పాల్పడిందని, ప్రధాని మోదీ అవినీతి ఛాంపియన్ అని ఇటీవల రాహుల్‌గాంధీ విమర్శించారు.

## రాజవంశ పాలనే నమ్ముతున్నారు.. రాహుల్ గాంధీపై నిప్పులు చెరిగిన నడ్డా



కాంగ్రెస్ అగ్రనేత,కేరళ వయనాడ్ లోక్‌సభ అభ్యర్థి రాహుల్ గాంధీపై బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా నిప్పులు చెరిగారు. రాహుల్ గాంధీ ఇంకా రాజవంశ పాలనను విశ్వసిస్తున్నారని విమర్శించారు. వయనాడ్ బీజేపీ లోక్‌సభ అభ్యర్థి కే సురేంద్రన్‌కు మద్దతుగా జేపీ నడ్డా కేరళ సుల్తాన్ బేతరిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రోడ్‌షోలో నడ్డా రాహుల్ గాంధీ ఇంకా రాజవంశ పాలను నమ్ముతున్నారని ఆరోపించారు. భారతదేశ ప్రజస్వామ్య పాలన ప్రమాదకరమని ఆయన భావిస్తున్నారని తెలిపారు. విభజించు పాలించు, ఓటు బ్యాంకు రాజకీయాల్ని ఆచరిస్తున్నారని ఆరోపించారు . నిషేధిత ఇస్లామిస్ట్ సంస్థ పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ)అనుసంధానమైన రాజకీయ పార్టీ సోషల్ డెమోక్రాటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డీపీఐ) కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వడంపై మండిపడ్డారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎస్‌డీపీఐ కాంగ్రెస్‌కు, స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎంకు మద్దతు ఇస్తోందని, ఈ రెండు పార్టీలు దేశ వ్యతిరేక శక్తులకు అనుకూలంగా ఉన్నాయని అన్నారు. కాంగ్రెస్, సీపీఐ(ఎం) రెండూ సైద్ధాంతికంగా దివాళా తీశాయని పేర్కొన్నారు.

## కోయంబత్తూరులో రూ.1000 కోట్లు.. బీజేపీ చీఫ్ సంచలన ఆరోపణలు



**చెన్నై :** తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు, కోయంబత్తూరు అభ్యర్థి కె.అన్నామలై సంచలన ఆరోపణలు చేశారు. కోయంబత్తూరులో ఓటర్లను ప్రభావితం చేసేందుకు డీఎంకే, ఏఐఏడీఎంకేలు రూ.1000 కోట్లకు పైగా ఖర్చు చేశాయని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల మొదటి దశలో పోలింగ్‌లో భాగంగా అన్నామలై కరూర్‌లోని ఉత్తుపట్టిలోని పోలింగ్ బూత్‌లో ఓటు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఆరోపణలు చేశారు. తమిళనాడులోని మొత్తం 39 స్థానాలకు ఈరోజు పోలింగ్ జరుగుతోంది. కోయంబత్తూరులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైపై డీఎంకే నుంచి గణపతి పి.రాజ్‌కుమార్, ఏఐఏడీఎంకేకు చెందిన సింగై రామచంద్రన్ పోటీ చేస్తున్నారు. కోయంబత్తూరులో బీజేపీ వ్యక్తి తమను ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని విపక్షాలు ఒక్కరినైనా తీసుకురాగలిగితే తాను రాజకీయాల నుంచి తప్పుకొంటానని అన్నామలై సవాలు విసిరారు. బీజేపీ సొంతంగా 25 శాతం దాటుతుందని, సీట్ల సంఖ్య కూడా రెండంకెల్లో ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. "ఈ రోజు నేను నా ప్రజాస్వామ్య కర్తవ్యాన్ని నిర్వర్తించాను. దేశంలోని ప్రతి పౌరునికి ఇది ఒక ముఖ్యమైన కర్తవ్యం. ఎందుకంటే భారతదేశంలో పనిచేసే ప్రజాస్వామ్యం ఉంది. ఇక్కడ పౌరులు ప్రజాస్వామ్యాన్ని పని చేసేలా చేస్తారు. మంచి వ్యక్తులు, పాలనపై ప్రజలు తమ విశ్వాసాన్ని మరోసారి చూపిస్తారని మాకు నమ్మకం ఉంది. తమిళనాడు ప్రజలు చరిత్రాత్మకమైన మార్పునకు నాంది పలుకుతారు" అని అన్నామలై పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ కాంగ్రెస్ రెండు అవినీతి పార్టీలే

-మొదటి పేజి తరువాయి

చట్టాలు చేశామన్నారు. మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఉమ్మడి పౌర చట్టం తీసుకుని వస్తామని హామీ ఇచ్చారు. మళ్ళీ మోదీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలు నెహ్రూ, ఇందిరమ్మ, రాజీవ్ గాంధీ పేదరికం పోగడుతాం అన్నారని... దేశంలో పేదరికం పెరిగిందన్నారు. మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత పేదరికం పోయిందని అన్నారు.

ప్రపంచ దేశాలు భారత్ ఏం చేయబోతుందని చూస్తున్నాయని... అంతటి గౌరవాన్ని మోది హయాంలో వచ్చిందని వెల్లడించారు. ఆర్థిక స్థితిలో 11వ స్థానం నుంచి ఇప్పుడు 5 వ స్థానంలో ఉందన్నారు. గత రెండు సంవత్సరాలుగా ఉక్రెయిన్, రష్యా యుద్ధం జరుగుతోందని... మోదీఅక్కడి తెలుగు వారిని కాపాడారన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకంలో 70 సంవత్సరాలు దాటిన వారికి 5లక్షల రూపాయల ఉచిత వైద్యం అందించామన్నారు. బీజేపీని గెలిపించాలని కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ కోరారు.

**కాంగ్రెస్ అవుట్ డేటెడ్ పార్టీ.. రాజ్‌నాథ్ సింగ్ సెటైర్లు**

కాంగ్రెస్ అవుట్‌డేటెడ్ పార్టీ.. దేశ రాజకీయాల్లో ఉనికిని కోల్పోతుంది అని కేంద ప్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. సికింద్రాబాద్ బీజేపీ లోక్‌సభ అభ్యర్థి కిషన్ రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నామినేషన్ ప్రక్రియకు ముందు ఏర్పాటు చేసిన పార్టీ సభలో రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడారు. 'కాంగ్రెస్ కాలం చెల్లిపోయింది. దేశ రాజకీయాల్లో తన ఉనికిని కోల్పోయింది. బీజేపీ మాత్రం దేశ నిర్మాణం కోసమే రాజకీయాలు చేస్తుందని



ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను ఉద్దేశించి, తెలంగాణలోని అధికార పార్టీకి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. అయితే తెలంగాణ ఏర్పాటు ఘనత బీఆర్ఎస్‌కు కాదని, అనేక మంది త్యాగాల వల్లే దక్కుతుందని సూచించారు.

గత కాంగ్రెస్ హయాంలో అవినీతి ఆరోపణల గురించి ప్రస్తావిస్తూ..అటల్ బిహారీ వాజ్‌పేయి, నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వాలపై ఒక్క అవినీతి ఆరోపణ కూడా లేదని అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం సాధించిన విజయాలను వివరిస్తూ.. మోదీ నాయకత్వంలో దేశంలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని అన్నారు. కిషన్ రెడ్డి (సికింద్రాబాద్), ఈటల రాజేందర్ (మల్కాజ్‌గిరి)లకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

**బీఆర్ఎస్‌ను తరిమి కొట్టినందుకు**

గడిచిన పది సంవత్సరాలుగా బీజేపీ ప్రభుత్వం ఒక్క అవినీతి లేకుండా నరేంద్ర మోడీ పాలన చేస్తున్నాడని కేంద్ర క్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ అన్నారు. ఖమ్మం బీజేపీ పార్టీ ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్ రావు విజయాన్ని కాంక్షిస్తూ కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ ఖమ్మం నగరంలో రోడ్ షో నిర్వహించారు. ఖమ్మం నగరంలోని జెడ్.పీ సెంటర్ లో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో బీఆర్ఎస్ అవినీతి ప్రభుత్వాన్ని తరిమికొట్టినందుకు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

**బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు అవినీతి ప్రభుత్వాలే**

తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు అవినీతి ప్రభుత్వాలే అని విమర్శించారు. ఈ ప్రభుత్వాల హయాంలో రైతులను మోసం చేసి యూరియా కుంభకోణం చేశాయని,రైతులపై భారం వేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులను ఆదుకునేందుకు మోదీ ఆర్థిక సాయం చేశారన్నారు.

కాశ్మీర్‌లో ఆర్టికల్ 370ని అమలు చేశామని గుర్తు చేశారు.మహిళలకు సమాన హక్కుల కోసం మోదీ ప్రభుత్వం చట్టాలను చేసిందన్నారు. ముస్లింల కోసం త్రిపుల్ తలాకును తొలగించామని,మూడోసారి బీజేపీ ప్రభుత్వం ఏర్పడబోతోందన్నారు. బీజేపి అధికారంలోకి రాగానే దేశంలో ఒకే పౌరసత్వాన్ని తీసుకురాబోతున్నామన్నారు.

కాంగ్రెస్ పార్టీ హయాంలో నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ ప్రధానిగా పనిచేసినప్పుడు పేదరికం తొలగిస్తామన్నారు కానీ ఇప్పటికీ పేదరికం అలానే ఉందన్నారు రాజ్ నాథ్ సింగ్. రష్యా, ఉక్రెయిన్ యుద్ధ సమయంలో తెలుగు ప్రజలను 22 వేల మందికి పైగా విద్యార్థులను స్వదేశానికి తీసుకువచ్చిన ఘనత ప్రధాని మోడీ దన్నారు.బీజేపిని గెలిపించి మూడోసారి మోదీని ప్రధాన మంత్రిని చేద్దామని ఖమ్మం ప్రజలు కూడా బీజేపిని ఆదరిస్తారన్నారు.

# కేసీఆర్ కాలం చెల్లింది..

-మొదటి పేజి తరువాయి

పరిశ్రమలను జిల్లాకు తీసుకురాలేదని.. కానీ మళ్లీ కేసీఆర్ ఓట్లు అడుగుతున్నారని మండిపడ్డారు. ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి పార్లమెంట్‌లో పాలమూరు గురించి ఏనాడు మాట్లాడలేదన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కారును బొంద తీసి పాతి పెట్టారని ఎద్దేవా చేశారు. కారును తూకం పెట్టి అమ్ముడేనని సెటైర్లు గుప్పించారు. రేవంత్ రెడ్డి హై టెన్షన్ వైర్ అని.. ముట్టుకుంటే మాడిపోతారని హెచ్చరించారు. ఎమ్మెల్యేలను కంచె వేసి కాపాడుకుంటానని స్పష్టం చేశారు. ఇది ఆడబిడ్డల ప్రభుత్వమని.. స్వయం సహాయక బృందాలతో మహిళా సంఘాలను ఆదుకున్నామని తెలిపారు.

**ఎస్సీ వర్గీకరణ సాధిస్తాం...**

కేసీఆర్ ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వకపోయినా తాము అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని స్పష్టం చేశారు. కేంద్రం నుంచి రూ.30 వేల కోట్లు నిధులను తీసుకువచ్చి పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గజ్వేల్ దొరలు - గద్వాల గడీల దొరసాని ప్రజలను బానిసల్లాగా మార్చుకున్నారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పాలనలో పాలమూరుకి మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో పాలమూరుకి సువర్ణ అవకాశమొచ్చిందని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ సాధించే బాధ్యత తమదని తెలిపారు. పాలమూరులోని రెండు పార్లమెంటు స్థానాలను గెలిపించాలని.. జిల్లాను మరింతగా అభివృద్ధి చేస్తానని మాటిచ్చారు.

**డీకే అరుణ జిల్లాకు ఏం చేశారు..?**

బీజేపీ నేత డీకే అరుణ జిల్లా అభివృద్ధికి కృషి చేయలేదని దుయ్యబట్టారు. పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా ఎందుకు తీసుకురాలేకపోయారని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మీద శాపనార్థాలు పెడుతున్నారని మండిపడ్డారు. 100 రోజులు కాకమునుపే ప్రభుత్వాన్ని కూలదోయాలని బీఆర్ఎస్, బీజేపీ నేతలు కుట్రలు చేస్తున్నారని విరుచుకుపడ్డారు. 10 ఏళ్లు రాష్ట్రంలో కేసీఆర్, కేంద్రంలో మోదీ పాలమూరుకు చేసిందేమీ లేదన్నారు. నాడు పలుగు, పారాబట్టి పాలమూరు నుంచి వలసలు పోయేవారని చెప్పారు. నేడు అదే పాలమూరు బిడ్డ నాయకుడై దేశం నలుమూలలు తిరిగి పాలమూరు ప్రతిష్ఠ పెంచారని అన్నారు.



వంశీ చంద్ రెడ్డిని, మల్లు రవిని లక్ష మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో 14 ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్‌ని గెలిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు.

**మానుకోట కాంగ్రెస్ కంచుకోట**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఫామ్ హౌస్ కేడీ తెలంగాణను దోపిడీ చేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. మహబూబాబాద్‌లో కాంగ్రెస్ 'జన జాతర' భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో కేసీఆర్, మోదీపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

దిగిపో దిగిపో అంటున్నావ్... ఉత్తగ వచ్చామా బిడ్డా అని కేసీఆర్‌కు రేవంత్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. మరో పదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని జోస్యం చెప్పారు. ఆగష్టు 15వ తేదీలోగా రైతులకు రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేస్తామని స్పష్టం చేశారు. రైతులకు రూ. 500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చారు. మానుకోట కాంగ్రెస్ కంచుకోట అన్నారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో మహబూబాబాద్ ప్రాంతం విధ్వంసమైందని దుయ్యబట్టారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెచ్చిన చట్టాలకు కేసీఆర్ మద్దతు తెలిపారని అన్నారు. తండ్రి రెడ్యానాయక్‌ను ఇంటికి పంపినట్టే బిడ్డ మాలోతు కవితను కూడా ఇంటికి పంపాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.

బయ్యారం ఉక్కు కర్మాగారాన్ని మోదీ ప్రభుత్వం పక్కకు పెట్టిందని మండిపడ్డారు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ సోనియా గాంధీ మంజూరు చేస్తే... మోదీ లాథూర్‌కు తరలించుకుపోయారని విరుచుకుపడ్డారు. ములుగు గిరిజన యూనివర్సిటీని సోనియా గాంధీనే మంజూరు చేశారని గుర్తుచేశారు. ఈ ప్రాంత ప్రజలను ఓటు అడిగే హక్కు బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకి లేదని చెప్పారు. తల్లిని చంపి బిడ్డను ఇచ్చారని మోదీ తెలంగాణను అవమాన పరిచారని ధ్వజమెత్తారు. అప్పుడు పార్లమెంట్‌లోతానే ప్రత్యక్ష సాక్షినని గుర్తుచేశారు. ఉత్తర భారతదేశంలోని కుంభమేళాకు మోదీ వేల కోట్లు ఖర్చు చేశారని.. మేడారం జాతరకు కేవలం రూ.3 కోట్లు ఇచ్చారని దుయ్యబట్టారు.

మేడారం మహాజాతరకు జాతీయ గుర్తింపు ఇవ్వబోమని చెప్పిన బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి ఓట్లు అడగడానికి సిగ్గు లేదా అని ప్రశ్నించారు. కేసీఆర్ బిడ్డ కవిత బెయిల్ కోసం బీఆర్ఎస్‌ను కేసీఆర్ మోదీకి తాకట్టు పెట్టారని ఆరోపించారు. కేంద్ర మంత్రి పథవుల్లోనూ తెలంగాణకు అన్యాయం చేశారని విరుచుకుపడ్డారు. ఢిల్లీలో రైతులను మోదీ ప్రభుత్వం కాల్చి చంపిందని ఆరోపించారు. 100రోజుల్లో ఐదు గ్యారంటీలు అమలు చేశామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

# మూడు పార్టీలు... బిగ్ ఫైట్

**హైదరాబాద్ :** 3 ప్రధాన పార్టీలు.. 17 సీట్లు.. తెలంగాణలో టఫ్ ఫైట్ నడుస్తోంది. పరస్పర ఆరోపణలు, వాగ్దానాలతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. మళ్లీ సత్తా చాటాలని కాంగ్రెస్.. ఈసారి గెలిచి చూపిస్తామని బీఆర్ఎస్.. 10 సీట్లు పక్కా అంటూ బీజేపీ..ఇలా ఎవరికి వారు గెలుపుపై ధీమా ఉన్నారు. ప్రచార ఘట్టం తారస్థాయికి చేరుకుంది. కమలం పార్టీ కొత్త వ్యూహాన్ని రచిస్తే.. కారు పార్టీ స్పీడ్ పెంచింది. మళ్లీ అసెంబ్లీ రిజల్ట్ రిపీట్ చేయాలని అటు కాంగ్రెస్ పార్టీ కసరత్తు చేస్తోంది.మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో జెండా ఎగరేసిన కాంగ్రెస్ పార్టీ.. పార్లమెంట్ ఎన్నికల్లోనూ సత్తా చాటాలని పట్టుదలగా ఉంది. 14 ఎంపీ సీట్లను కైవసం చేసుకుని బీఆర్ఎస్ ను భూస్థాపితం చేస్తామంటూ సవాల్ విసురుతోంది. ప్రచారాన్ని హోరెత్తించేందుకు కాంగ్రెస్ ప్రణాళికలు సిద్ధం చేసింది. శుక్రవారం నుంచి సీఎం రేవంత్ సుడిగాలి పర్యటనలు చేయనున్నారు. తెలంగాణ వ్యాప్తంగా 50 సభలు, 15 రోడ్ షో లు నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ ప్లాన్ చేస్తోంది. మరోవైపు అభ్యర్థుల నామినేషన్ల ర్యాలీలోనూ సీఎం రేవంత్ పాల్గొననున్నారు.మెదక్, వరంగల్, భువనగిరి, మహబూబ్ నగర్, మహబూబాబాద్ అభ్యర్థుల నామినేషన్ల కార్యక్రమాలకు సీఎం రేవంత్ హాజరుకానున్నారు. అలాగే ఒక్కో లోక్ సభ నియోజకవర్గంలో కనీసం 3 చోట్ల సీఎం సభలు నిర్వహించేలా కాంగ్రెస్ వ్యూహ రచన చేస్తోంది.లోక్ సభ ఎన్నికల ప్రచారం కోసం బీజేపీ కొత్త వ్యూహం రచించింది. ప్రతి అభ్యర్థి నామినేషన్ ను భారీ ఈవెంట్ లా ప్లాన్ చేస్తోంది. ఒక్కో అభ్యర్థి నామినేషన్ కు ఒక్కో జాతీయ నేత వచ్చేలా షెడ్యూల్ ప్రిపేర్ చేశారు. నామినేషన్ల కార్యక్రమాలకు బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, డిప్యూటీ సీఎంలకు తెలంగాణ బీజేపీ ఆహ్వానం పంపింది.సికింద్రాబాద్ ఎంపీ స్థానానికి బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్ రెడ్డి నామినేషన్ దాఖలు చేయనున్నారు. కిషన్ రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ హాజరుకానున్నారు. 18న మెదక్ ఎంపీ స్థానానికి రఘునందన్ రావు బీజేపీ తరుపున నామినేషన్ వేయనున్నారు. దీనికి గోవా సీఎం ప్రమోద్ సావంత్ చీఫ్ గెస్ట్ గా హాజరుకానున్నారు. ఈ నెల 18న ఈటల రాజేందర్ మల్కాజ్ బీజేపీ ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈటల నామినేషన్ కార్యక్రమానికి కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరీ ముఖ్య అతిథిగా రానున్నారు. అలాగే కరీంనగర్ ఎంపీ అభ్యర్థిగా బండి సంజయ్ ఈ నెల 25న నామినేషన్ వేయనున్నారు. దీనికి గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్, కిషన్ రెడ్డి చీఫ్ గెస్టులుగా హాజరుకానున్నారు.అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్.. పార్లమెంటు ఎన్నికల్లో సత్తా చాటాలని పట్టుదలగా ఉంది. గురువారం కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్ నేతలు సమావేశం కానున్నారు. ప్రతిపక్ష పార్టీగా అవతరించిన తర్వాత తొలిసారి కేసీఆర్ రాష్ట్ర స్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సమావేశం ద్వారా నేతలను పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం చేయనున్నారు. తెలంగాణ వ్యాప్తంగా బస్సు యాత్రలు నిర్వహించాలని నిర్ణయించిన గులాబీ బాస్.. బస్సు యాత్ర రూట్ మ్యాప్ పై పార్టీ నేతలతో చర్చించనున్నారు. 17 పార్లమెంట్ స్థానాల్లో పోటీ చేయబోతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులకు కేసీఆర్ ఈ సమావేశంలోనే బీ-ఫారాలు అందచేయనున్నారు.ఇక తెలంగాణలో మూడు ప్రధాన పార్టీలు ప్రచారాన్ని హోరెత్తించనున్నారు. ప్రజలకు వాగ్దానాలతో పాటు ఇతర పార్టీల విమర్శనాస్త్రాలు సంధించేందుకు ఎవరికి వారు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. మరి తెలంగాణ ప్రజలు ఎవరికి జై కొడతారో చూడాలి.

## కాంగ్రెస్ వైఫల్యాలను ఎత్తిచూపుతూ..

-మొదటి పేజి తరువాయి



ఈ యాత్రకు సంబంధించిన ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఇక అసెంబ్లీ ఎన్నికల్లో ఘోరంగా దెబ్బతిన్న గులాబీ పార్టీకి ఇటీవల కీలక నేతలు గుడ్‌బై చెప్పడం కొంతమేర నిరాశను మిగిల్చిందనే చెప్పాలి. అయినా పార్లమెంట్ ఎన్నికల్లో పుంజుకుంటామని బీఆర్ఎస్ శ్రేణులు ఆశాభావంతో ఉన్నాయి. ఈ క్రమంలో కేసీఆర్ బస్సు యాత్ర అనుమతి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్ రాజ్‌ను బీఆర్ఎస్ నాయకులు కే వాసుదేవా రెడ్డి శుక్రవారం కలిశారు.

బస్సు యాత్ర వివరాలను వికాస్ రాజ్‌కు వాసుదేవా రెడ్డి అందజేశారు. ఈ నేపథ్యంలో యాత్రకు సంబంధించి భద్రతా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. యాత్రకు పోలీసుల సహకారం అందించేలా చూడాలని కోరారు. ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగేలా చూడాలని వాసుదేవా రెడ్డి కోరారు. కాగా కాంగ్రెస్ వైఫల్యాలను ఎత్తిచూపుతూ.. బీర్ఎస్ పార్టీకి పూర్వవైభవం తీసుకురావడమే ధ్యేయంగా కేసీఆర్ లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. గత పదేళ్లలో బీఆర్ఎస్‌స హయాంలో చేపట్టిన కార్యక్రమాలు, వాటి ద్వారా కలిగిన లబ్ధిని ప్రజలకు వివరించేలా ప్రచారం నిర్వహించనున్నారు. ఎన్నికల ప్రచారం కోసం ఈనెల చివరి వారం నుంచి బస్సు యాత్ర చేయనున్నారు, సాయంత్రం సమయాల్లో ఒక్కో లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో రెండు, మూడు చోట్ల రోడ్‌షోలు ఉండనున్నాయి. రెండు, మూడు వారాల పాటు జరిగే ఈ బస్సు యాత్రలో భాగంగా ఉదయం పూట పంట పొలాలు, కల్లాలు, కొనుగోలు కేంద్రాల సందర్శనతోపాటు వివిధ వర్గాలతో భేటీ అవుతారు. బస్సుయాత్రలో తన వెంట వచ్చే బృందానికి బస ఏర్పాట్లు చేయాలని పార్టీ నేతలకు సూచించారు. సిద్దిపేట, వరంగల్, ఖమ్మం, మహబూబ్‌నగర్‌లలో లక్ష మందితో మినీ సభలు కూడా ఏర్పాటు చేద్దామన్నారు.

## అబద్ధాలలో రేవంత్ రెడ్డితో మల్లు భట్టివిక్రమార్క పోటీపడుతున్నారు: హరీశ్ రావు

**కాంగ్రెస్ నేతలు పోటీ పడి మరీ అబద్ధాలు చెబుతున్నారన్న హరీశ్**

**ఆరు గ్యారెంటీలు.. నూరు అబద్ధాలతో సమానమని వారి మాటల ద్వారా నిరూపితమైందన్న హరీశ్ రావు**

**రుణమాఫీ చేస్తామని రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ తెలియనట్లుగా భట్టి నటిస్తున్నారని ఎద్దేవా**

**ఏరు దాటే దాకా ఓడ మల్లన్న... ఏరు దాటాక బోడి మల్లన్న అన్నట్లు కాంగ్రెస్ తీరు ఉందని విమర్శ**



కాంగ్రెస్ పార్టీ నాయకులు అబద్ధాలలో పోటీ పడుతున్నారని బీఆర్ఎస్ సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. ఈ మేరకు ఆయన సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క వివిధ సందర్భాలలో మాట్లాడిన వీడియోలను ట్వీట్ చేశారు. వారు పోటీ పడి మరీ అబద్ధాలు చెబుతున్నారని వ్యాఖ్యానించారు. ఆరు గ్యారెంటీలు.. నూరు అబద్ధాలతో సమానమని వారి మాటల ద్వారా మరోసారి నిరూపితమైందని పేర్కొన్నారు. 'అబద్ధాల్లో సీఎం రేవంత్ రెడ్డితో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క గారు పోటీ పడుతున్నారు. నిరుద్యోగ భృతిపై కాంగ్రెస్ పార్టీ ఎలాంటి హామీ ఇవ్వలేదని నిండు అసెంబ్లీలో ప్రకటించి అభాసుపాలైన భట్టి.. తాజాగా రుణమాఫీపై కూడా నాలుక మడత బెట్టారు. వంద రోజుల్లో రుణ మాఫీ చేస్తామని హామీ ఇవ్వలేదని భట్టి చెప్పడం 70 లక్షల మంది రైతులను ఘోరంగా వంచించడమే. డిసెంబర్ 9నే 2 లక్షల రుణమాఫీ చేస్తామని రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడి హోదాలో చెప్పడమే గాక, ముఖ్యమంత్రిగా మొదటి సంతకం రుణమాఫీ పైనే అని చెప్పిన విషయం భట్టికి తెలియనట్టు నటించడం హాస్యాస్పదం' అని పేర్కొన్నారు. ఏరు దాటే దాకా ఓడ మల్లన్న... ఏరు దాటాక బోడి మల్లన్న అన్నట్లు కాంగ్రెస్ నాయకుల పరిస్థితి ఉందన్నారు. ఎన్నికల ముందు హామీల వర్షం గుప్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ... ఎన్నికల తర్వాత మొండి చేయి చూపిస్తోందని విమర్శించారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని... వచ్చే ఎన్నికల్లో తప్పక బుద్ధి చెబుతారని హెచ్చరించారు. నిన్న నిరుద్యోగ భృతిపై ఎగవేత -నేడు రైతు రుణమాఫీపై దాటవేత ధోరణి అవలంబిస్తున్నారన్నారు. కాంగ్రెస్ నేతల మోసాలకు ఇవిగో సాక్ష్యాలు అంటూ వారు మాట్లాడిన వీడియోలు ట్వీట్ చేశారు.

## డూప్లికేట్ ఓట్లపై ఫోకస్..



-మొదటి పేజి తరువాయి

తొలగించినట్లు ఈసీ పేర్కొంది. మరోవైపు.. గత రెండేళ్లలో దాదాపు 60.6 లక్షల మంది కొత్త ఓటర్లు చేరినట్లు సీఈఓ వికాస్ రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు.

జూబ్లీహిల్స్, చంద్రయాన్‌గుట్ట-61వేలు, ముషీరాబా మలక్ పేట్- నాంపల్లి, బహదూర్‌పూర్‌లో 41వేల డూప్లికేట్ ఓట్లు, యాకుత్పురాలో-48 వేలు ఉన్నట్లు గుర్తించినట్లు హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ చెప్పారు. ఒక్క జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోనే 53,000 షిఫ్టెడ్ ఓట్లు ఉన్నట్లు ఎన్నికల అధికారులు గుర్తించారు చాంద్రాయణగుట్ట, యాకుత్‌పురాలో వరుసగా 59,289 ఓట్లు, 48,296 డూప్లికేట్ ఓట్లు గుర్తించామని ఎన్నికల సంఘం వెల్లడించింది.

# సంపాదకీయం

## హిందూత్వ ఎజెండా గట్టెక్కిస్తుందా?

ప్రజల బాధలు, గాధలు, దు:ఖాలు, నిట్టూర్పులు, కండ్లనీళ్లు తుడవటం, ఇంటిల్లి పాదినీ కలవటం, ఓటు కోసం బతిమిలాడటం, దేబురించడం, అడుక్కోవటం అంతా ఓ దండుగ మారిపనిగా, ఔడ్డేటెడ్ వ్యవహారంగా భావించినట్టు ఉంది భారతీయ జనతా పార్టీ. పదేండ్ల అధికార అహంతో తెగించిందన్న విషయాన్ని ఆదివారం వారు విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టో చెప్పకనే చెబుతోంది. వికసిత భారత్, అచ్ఛేదిన్, అమృత్‌కాల్ ఇత్యాది అద్భుతపదజాలంతో ఎన్నికల్లో ఘన విజయాలు సాధించాలని బీజేపీ ఎన్నికల మేనిఫెస్టో దిశానిర్దేశం చేస్తుంటే, దేశంలో పరిస్థితులు అంత పచ్చగా ఏమీ లేవని, పైగా దిగజారిపోతున్నాయని ఇటీవల వెలువడిన నివేదికలు ఎండగడుతున్నాయి. రైతులు, యువకులు, మహిళలు, పేదలే తమకు ముఖ్యమని చెప్పిన బీజేపీ.. చివరకు తమ మేనిఫెస్టోలో వారినే విస్మరించింది. మరి వీరు లేని 'వికసిత భారత్'నా బీజేపీ కోరుకోంటుంది? అసలు ఏ వర్గానికీ మేలు చేయని ఎన్నికల ప్రణాళికను కమలదళం అందమైన అబద్ధాలతో వండివార్చింది. బ్రిటీషు ఏలుబడిలో కంటే మోడీ పాలన లోనే భారతదేశంలో అసమానతలు అధికంగా ఉన్నాయని వరల్డ్ ఇనీక్వాలిటీ ల్యాబ్ అధ్యయనపత్రం హెచ్చరికలను పట్టించుకోని కమలనాధులు బీజేపీ సంకల్ప పత్రం పేరుతో 'సంవిధాన్ బద్ లో పత్ర' ను విడుదల చేశారు. హిందూత్వ ఎజెండాతో మరోసారి అధికారంలోకి రావాలన్న కాంక్షతో హామీలను గుప్పిస్తున్నది. ముఖ్యంగా జమ్మూకాశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించే 370 ఆర్టికల్‌ను రద్దు చేయడం, మహిళా రిజర్వేషన్ బిల్లు, ఉమ్మడి పౌరస్మృతిని అమల్లోకి తెస్తామని ఆ పార్టీ చెబుతున్నది. ఆర్థికంగా దేశాన్ని ప్రపంచంలోనే మూడో స్థానంలోకి తీసుకొస్తామని ఇంతకు మించిన ప్రగతి ఏ దేశంలోనైనా సాధ్యమవుతుందా అని ఆ పార్టీ ప్రశ్నిస్తున్నది. కీలకమైన నిరుద్యోగం, పేదరికం, ధరల మంట గురించి ఆ పార్టీ ప్రస్తావించడం లేదు. అయితే అయోధ్యలో రామ మందిరం లాంటి భావోద్వేగ ఎజెండాతో మూడోసారి ఓట్లు కొల్లగొట్టాలని ఆలోచిస్తున్నది. గత పదేండ్లలో తమ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చామని, అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న నయా భారత్‌ను అడ్డుకోవడం అసాధ్యమని సాక్షాత్తు ప్రధాన మంత్రే సెలవిస్తున్నారు. కానీ, ఆకలి నుంచి ఆనందం వరకూ ప్రతీ విషయంలోనూ పరిస్థితులు దిగజారాయని, ఇరుగుపొరుగు చిన్నాచితకా దేశాలకంటే మన పరిస్థితి అత్యంత దయనీయమని అనేక సర్వేలు ప్రకటించాయి. 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని చెప్పిన మోడీ అందుకు విరుద్ధంగా రైతాంగ వ్యతిరేక విధానాలు అమలు జరుపుతున్నారు. ఎంఎస్‌పీ అమలు ప్రస్తావన లేని ఎన్నికల ప్రణాళికలో వివాదాస్పద సిఎఎ అమలుకు మాత్రం హామీ ఇచ్చింది. అంతే కాదు, ప్రతి పదేండ్లకోకసారి జరిగే జన గణనను చేపట్టని అధికార పార్టీ... లౌకిక భారతాన్ని విచ్ఛిన్నం చేసే వినాశకర పౌరసత్వ చట్ట సవరణ- 2019ని ఎన్నికలనంతరం అమలు చేస్తామని చెప్పింది. 'మోడీ గ్యారంటీ అంటే 24 క్యారెట్ల బంగారం వంటిది. అందుకే మాది ప్రపంచ పార్టీల మేనిఫెస్టోల్లోనే గోల్డ్ స్టాండర్డ్ మేనిఫెస్టో' అని బీజేపీ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. మరి 'జన్‌ధన్' ఖాతాలో రూ.15 లక్షల నగదు వేస్తమన్న హామీ సంగతేంటి? 2014 మ్యానిఫెస్టోలో ఏడాదికి 2 కోట్ల చొప్పున ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించింది. పదేండ్లలో ఆ హామీ అమలు కాలేదు. ఈసారి అసలు ఉద్యోగాల ముచ్చటే మ్యానిఫెస్టోలో పెట్టలేదు. కానీ, గిగ్ వర్కర్లకు ముద్రా లోన్‌ల కింద రూ.20లక్షల లోన్ ఇస్తామని చెబుతోంది. ఉపాధికి మౌలిక సదుపాయాలు కల్పించగుండా రూ.20లక్షల లోన్ ఇచ్చినా.. రూ.60 లక్షల లోన్ ఇచ్చినా ఉపయోగం ఏంటి? ప్రభుత్వ పరంగా నిర్వహించిన జీ20 దేశాల సదస్సును కూడా వీరి ఖాతాలో వేసుకుంటున్నారు. అంతే కాదు భారత్‌లో ఒలింపిక్స్ నిర్వహించి సత్తా చాటుతాం అని కూడా వీరి మేనిఫెస్టోలో పేర్కొన్నారు. జమిలి ఎన్నికల గురించి ప్రస్తావించిన ఎన్నికల ప్రణాళికలో పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసరాల ధరల అదుపు గురించి లేకపోవడం వైచిత్రి. "ఉచితాల పేరుతో అధికారంలోకి రావాలన్న యావే తప్ప, వీటి వల్ల ఆర్థిక వ్యవస్థ నాశనమవు తుందన్న ధ్యాసే ప్రతిపక్షాలకు లేద"న్న ప్రధానమంత్రి, పదేండ్లలో చేసిందేమీ లేకపోవడంతో ఈ సారి ఎన్నికల్లో గెలిపిస్తే ఉచిత రేషన్, ఉచిత విద్యుత్, ఉచిత వైద్యం, ఉచిత ఇండ్లు పేరుతో "ఉచిత పథకాల" జపం చేస్తున్నారు. వివిధ రాష్ట్రాలు సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే, వాటిని తప్పు పట్టిన మోడీ తన మ్యానిఫెస్టోలో మాత్రం మొత్తం ఉచిత పథకాల హామీనే ఇచ్చారు. ఆయన ప్రభుత్వం గడిచిన పదేండ్లలో అమలు చేసిన పథకాలన్నీ అవసరమైన కొందరికే పరిమితం చేశారట..! రేషన్ బియ్యమైనా, రైతులకు ఆర్థిక సహాయమైనా, ఉచిత వైద్యమైనా, ఉచిత ఇండ్లయినా అదే జరిగింది. సుస్థిరత, సమర్థత, భద్రత, సంకల్ప్ లాంటి గంభీరమైన మాటలు జోడించి పేజీలు నింపారే తప్ప, నిజంగా భారతీయ సమాజం ఇవ్వాల ఏమి కోరుకుం టున్నదో గుర్తించి, దానిపై పార్టీ విధానం ప్రకటించలేదు. బహుశా, ఇదే బీజేపీ విధానమేమో..!

# ఓటర్లే ఆత్మపరిశీలన చేసుకోవాలి!



ఓటు అనేది హక్కు అని పేర్కొన్నప్పటికీ అది ఒక బాధ్యత. మన బతుకులు ఎలా ఉండాలో నిర్ణయించే ప్రక్రియ. అటువంటి విలువైన ప్రక్రియ నేటికీ డొల్లతనం గానే సాగుతుండటం అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన మనకి గొడ్డలిపెట్టు లాంటిది. ఎన్నికల సమరం సమీపిస్తున్న తరుణంలో ఓటు ప్రగతి వైపు పడేలా చూసుకోవాల్సిన బాధ్యత సగటు ఓటరు పై ఉన్నది. ఎన్నికల సమయంలోనే ఉచితాల మీద ఓటర్ల మధ్య చర్చ జరగాల్సిన అవసరం ఉంది. ఇది ప్రస్తుతం మన దేశంలో, మరీ ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాల్లో హద్దు మిరింది. సంపద సృష్టిస్తా, ఉద్యోగాలు పుట్టిస్తా అని మొన్నటి వరకు మాట్లాడిన నాయకులు సైతం ఇప్పుడు సంక్షేమం, ఉచితాల బాట పట్టడం గమనార్హం. ఎన్నికల హామీలు కార్పొరేట్ కంపెనీలు పండగ సీజన్లో అందించే ఆఫర్లు లాగా రూపాంతరం చెందడం గర్హనీయం. ఒక కంపెనీ ఆఫర్ ఇస్తుంది అంటే దాని అంతిమ లక్ష్యం లాభాలను,రాబడులను పెంచుకోవడం కోసమే, కానీ రాజకీయ నాయకులు ఇచ్చే హామీల వలన రాష్ట్రానికి వచ్చే లాభం గురించి ఆలోచిస్తున్నారా లేదు. వారు ఆలోచిస్తున్నది కేవలం అధికారం కోసమే,వారి లాభాల కోసమే గాని రాష్ట్రం కోసమో, రాష్ట్ర ప్రజల కోసమో కాదు.

పొరుగు రాష్ట్రాలతో పోల్చుకుంటే తెలుగు రాష్ట్రాల్లో సామాజిక భద్రత పింఛన్లు దాదాపు రెండు, మూడు రెట్లు ఉంటున్నాయి. 2050 నాటికి మన దేశంలో వృద్ధుల జనాభా రెట్టింపు అవ్వనుంది. తద్వారా వారికి ఇచ్చే ఫించన్ల భారం రాష్ట్రం ఖజానాపై ఇప్పటికంటే ఐదు రెట్లు ఉండే అవకాశం ఉంది. ప్రతీ ఎన్నికకు వేలంపాటను తలపించేలా ప్రధాన రాజకీయ పార్టీలు పింఛన్లు పెంచుకుంటూ పోతున్నారు. ఇదిలా ఉండగా ఈ మధ్య ఫించనుకు అర్థం మారేలా 40 ఏళ్ళు నిండి, పలానా కులంలో పుడితే చాలు మీ ఖాతాలో డబ్బులేస్తాం అనే దాకా ప్రస్తుత పరిస్థితి వచ్చింది. వృద్ధాప్యం వలనో, శారీరక వైకల్యం వలనో సొంత కాళ్ళ మీద నిలబడలేరు కాబట్టి ప్రభుత్వ సహాయం అవసరం. కానీ ఈ సహజ సూత్రాన్ని మరిచి కేవలం ఓటర్లను ఆకర్షించడానికి ఇమ్మడి ముబ్బడిగా రాజకీయ పార్టీలు హామీలు గుప్పిస్తుంటే, అవి విని సగటు ఓటరు చప్పట్లు కొట్టి శభాష్ అనడం తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుత పరిస్థితికి అద్దం పడుతుంది.

చెప్పేటోడు ఎన్నైనా చెప్తడు...ఇనేటోడికి ఉండాలి కదా అని అన్నట్లు రాజకీయ పార్టీలు వాటి మనుగడ కోసం హామీలు ఇవ్వడం సహజం. కానీ అంతిమంగా వాటిపై నిర్ణయం తీసుకునేది రహస్య ఓటింగ్ పద్దతిలో ఓటరు మాత్రమే. ఉదాహరణకు రోడ్డు వేసిన నాయకులకు ఓటు వేయకుండా, మద్యాన్ని పంచి రోడ్డున పడేసిన వారికి ఓటు వేస్తుంటే, తదుపరి ఎన్నికల్లో రోడ్డు వేసిన నాయకులు సైతం ప్రజల్ని రోడ్డున పడేసే విధానాలే అవలంబిస్తారు. వ్యవస్థలని, పార్టీలని నిందించే బదులు ఓటర్లే ఆత్మ పరిశీలన చేసుకోవాల్సిన తరుణం ఆసన్నమైంది. తాత్కాలిక తాయిలాల ప్రభావం నుంచి బయటకు వచ్చి తార్కికంగా నిర్ణయం తీసుకోవాల్సిన సమయం ఇది. ఉచితాలతో పాటు ఎన్నిక వ్యవస్థని పట్టి పీడిస్తున్న సమస్య చట్ట సభల్లో నేరగాళ్ల ప్రవేశం మొదలగు దీర్ఘకాలిక జాడ్యాలకి పరిష్కారం సగటు ఓటరుకి అవగాహన కల్పించడమే.

మన దేశం అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం అయినప్పటికీ కేవలం ఓటింగ్ రోజు మాత్రమే ఆ ప్రజాస్వామ్య భావనను అనుభవించగలం. ఇతర దేశాల్లోలాగా ఒకసారి ఎన్నికైన ప్రజా ప్రతినిధిని ఓటర్లే తొలగించే రీకాల్, రెఫరెండం లాంటి ప్రజాస్వామ్య సాధనాలు లేవు. కాబట్టి ఐదేళ్లలో ఒక్కసారి వచ్చే అవకాశాన్ని భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నిర్ణయించుకోవాలి. మాకు నీళ్లు రావట్లేదు, మాకు రోడ్డు వేయట్లేదు, మమ్మల్ని పట్టించుకున్న నాథుడే లేడు అని మీడియా వారితో గోడు వెళ్లబోసుకోవాల్సిన దుస్థితి సగటు ఓటరు తెచ్చుకోవద్దు. చివరిగా....కులం, మతం, డబ్బు ఇతరత్రా ప్రభావాల నుంచి బయటకు వచ్చి మీ బిడ్డల భవిష్యత్తు, మీ ఇంటి ఆడవారు బయటకు వెళ్తే క్షేమంగా ఇంటికి తిరిగి వస్తున్నారా ఏదైనా సమస్య వస్తే పోలీసు వారు పక్షపాతం లేకుండా మన ఫిర్యాదు తీసుకుని న్యాయం చేస్తున్నారా, జబ్బు వచ్చి ఆసుపత్రికి వెళ్తే కొద్ది పాటి ఖర్చుతో క్షేమంగా ఇంటికి తిరిగి వస్తున్నారా మొదలగు ప్రశ్నలు వేసుకుని ప్రతీ ఓటరు మహాశయుడు నిర్ణయం తీసుకుని మన రాష్ట్రాన్ని, దేశాన్ని అభివృద్ధి పథంలో దూసుకువెళ్లేలా తమ ఓటు హక్కును వినియోగిస్తారు అని ఆశిస్తూ...

# ప్రథమ నేపథ్య గాయకుడు ఎమ్మెస్



"శ్రీ హనుమాన్ గురుదేవులు నా యెద పలికిన సీతా రామ కథ....నే పలికెద సీతా రామ కథ"... ఎమ్మెస్ రామారావు సుమధుర కంఠం నుండి జాలువారిన సుందరాకాండ వినని తెలుగు వారు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. హనుమాన్ జయంతి, శ్రీ రామ నవమి నేపథ్యం లో, హనుమాన్ మండల దీక్షలు, రామ నవరాత్రుల సందర్భంగా ఎక్కడ విన్నా సుందరాకాండ వినిపించడం సర్వ సాధారణమే. అంతేకాక, ఆంజనేయ, రామాల యాలలో నిరంతరం మైకుల ద్వారా రామారావు గానం చేసిన సుందరా కాండ ప్రతిధ్వనించడం కద్దు. మోపర్తి సీతారామారావు అంటే ఎవరో చాలామందికి వెంటనే స్ఫురించక పోవచ్చును. కాని ఎం.ఎస్.రామారావు అనగానే తెలుగు సినిమాల తొలి నేపథ్య గాయకునిగా సంగీతాభిమానులకు, పాత తరం సినీ ప్రేక్షకులకూ ఆయన గుర్తుంటారు. సుందరదాసు' అన గానే ఆయన యావత్ తెలుగు ప్రజలందరికీ సుపరిచితులు, సుప్రసిద్ధులు. ఆయన రచించి, సంగీతం సమకూర్చి గానం చేసిన 'సుందరకాండ' గీతాలు యావ దాంధ్ర దేశంలోనూ మారు మ్రోగాయి. మారు మ్రోగుతు న్నాయి. ఇంకా మారు మ్రోగుతూనే ఉంటాయి. రామాయణంలోని మధురమైన 'సుందరకాండ' కథను, తేట తెలుగులో, మృదు మధుర మైన శైలిలో ఆయన పాడిన తీరు అసమానం, అపూర్వం, అద్వితీ యం. ఇలా మూడు విధాలుగా స్వీయ రచన గావించి, సంగీతం సమకూర్చి, స్వయంగా గానం చేసిన అసమాన ప్రతిభాశాలి ఎమ్మెస్ రామారావుకు ముందు మరొక లేరనడం అతిశయోక్తి కాదు.

ఆయనకు "సుందర దాసు" అనే బిరుదు ఉంది. గేయ రూపంలో రచించి గానం చేసిన రామయణ భాగం సుందరకాండము "ఎమ్మెస్ రామారావు సుందరకాండ" గా సుప్రసిద్ధం. తులసీదాసు రచించిన హనుమాన్ చాలీసాను తెలుగులోకి అనువదించి ఆకాశవాణిలో పాడారు. ఆ రెండూ ఆయనకు మంచి గుర్తింపును, ఖ్యాతిని తెచ్చిపెట్టాయి. ఎమ్మెస్ రామారావు (మోపర్తి సీతారామారావు) 1921 మార్చి 7 న గుంటూరు జిల్లా అమృతలూరు మండలానికి చెందిన మోపర్రు గ్రామలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు మోపర్తి రంగయ్య, మంగమ్మ గార్లు సీతారామ భక్తులు. చిన్నతనం నుండే రామారావు గారు పాటలు పాడుతుండేవారు. ఆయన విద్యాభ్యాసము నిడుబ్రోలు ఉన్నత పాఠశాలలో, గుంటూరు హిందూ కళాశాలలో జరిగింది. ఇంటర్మీడియేట్ రెండవ సంవత్సరం చదువుతున్న రోజుల్లో (1941 లో) అంతర్ కళాశాలల లలిత సంగీత పోటీలో మొదటి బహుమతి గెలుచు కున్నారు. న్యాయనిర్ణేతల్లో ఒకరైన అడవి బాపిరాజు చలన చిత్ర రంగంలో ప్రవేశించమని ఆయనను చాలా ప్రోత్సహించారు. 1944 లో ప్రఖ్యాత సినీ దర్శక నిర్మాత వై.వి.రావు తన తహసీల్దార్ చిత్రంలో ఎమ్మెస్ చేత మొదటి సారిగా "ఈ రేయి నన్నొల్ల నేరవా రాజా" అనే ఎంకి పాట పాడిం చారు.

ఆ చిత్రంలో కథా నాయకుని పాత్ర పోషించిన సి.హెచ్. నారాయణరావుకు పాడారు. తెలుగు చలన చిత్ర చరిత్రలో ఇది మొట్ట మొదటి నేపథ్య గానం. అలా తెలుగు చలనచిత్ర చరిత్రలో మొట్టమొదటి నేపథ్య గాయకు లుగా గుర్తింపు పొందారు.తరువాత ఎమ్మెస్ దీక్ష, ద్రోహి, మొదటిరాత్రి, పాండురంగ మహాత్యం, నా యిల్లు, సీతారామ కల్యాణము, శ్రీరామాంజనేయ యుద్ధము మొదలైన సినిమాలలో పాడారు. 1944 నుంచి 64 వరకు తెలుగు చలన చిత్రాలలో నేపథ్య గాయకునిగా మద్రాసులో నివసిం చిన ఆయన 5 సంవత్సరాల పాటు కర్ణాటక శాస్త్రీయ సంగీతం నేర్చు కున్నారు. కొన్ని పాటలు రాసి నల్లపిల్ల, తాజ్ మహల్, హంపి, కనీసం, హిమాలయాలకు రాలేనయ్యా, మొదలైన గ్రామఫోన్ రికార్డులు ఇచ్చారు. నీరాజనం చిత్రంలో "ఈ విశాల ప్రశాంత ఏకాంత సౌధములో నిదురించు జహాపనా" పాటలో ఎమ్మెస్ గొంతు వినిపించింది.

1963 సంవత్సరాంతంలో మద్రాసు వదిలి వెళ్లి, రాజమండ్రి చేరుకుని 1974వరకు అక్కడే నివసించారు. అక్కడ నవభారతి గురుకులంలో పది సంవత్సరాలు ఉద్యోగం చేసా రు. 1970 లో పెద్ద కుమారుడు బాబూరావు భారతీయ వాయుసేన ఇండియన్ ఏర్ ఫోర్స్ లో పైలట్ ఆఫీసరుగా నియమితుడైనారు. 1971లో పాకిస్థానుతో జరిగిన యుద్ధ కాలంలో అతని ఆచూకీ తెలియ లేదు. తల్లి తండ్రులిద్దరూ భయం చెంది కుమారుని క్షేమం కోసం వాయు కుమారుడైన హను మంతుని ఆరాధించడం మొదలు పెట్టారు. తర్వాత కొంత కాలానికి అబ్బాయి క్షేమంగా ఇల్లు చేరడంతో శ్రీ హనుమానుడే వారి ఇష్ట దైవమై నాడు. ఆయన హనుమాన్ చాలీసా, సుందరకాండ వ్రాయ డానికి అదే ప్రేరణ. 1972 నుండి 74 వరకు తులసీదాసు హనుమాన్ చాలీసాను హిందీ నుంచి తెలుగు లోనికి అనువదించారు, తన పేరుతో అవినాభావ సంబంధ మేర్పడ్డ సుందరకాండ గేయ రచన చేశాడు. 1975 నుంచి హైదరా బాదులోని చిక్కడపల్లిలో నివసించారు. రామారావుకు 1977 సంవత్సరంలో సుందరదాసు అనే బిరుదాన్ని ఇచ్చారు. ఈయన ఏప్రిల్ 20, 1992న హైదరా బాదులో తుది శ్వాస విడిచారు.

# విద్వేష ప్రసంగాలు

పదేళ్ళ పాటు కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ.. తాను ప్రజలకు చేసిన మేలు ఇదీ అని ఘనంగా చెప్పుకోలేకపోతోంది. అందుకనే మతాన్ని, దానికి సంబంధించిన ఉద్వేగ అంశాలను ఈ సార్వత్రిక ఎన్నికల్లో వాడుకోవటానికి బరి తెగిస్తోంది! ఈ ధోరణి మన రాజ్యాంగ స్ఫూర్తికి, ఎన్నికల నిబంధనావళికి, సుప్రీంకోర్టు మార్గదర్శకాలకూ పూర్తి విరుద్ధం. ఎన్నికల సమరాంగణంలో నిలబడి, ప్రజల మద్దతును ఆశిస్తున్న వేళ.. తాము గత ఎన్నికల్లో చెప్పిందేమిటో, పదేళ్ల పాలనలో చేసిందేమిటో వివరంగా చెప్పుకొని, తీర్పును కోరటం అధికార పక్షం నాగరిక లక్షణం. కానీ, బిజెపి ఏ ఎన్నికల్లోనూ ఈ తరహా ప్రజాస్వామిక తీరును ప్రదర్శించలేదు. ఎందుకంటే- ఆ పార్టీ చేసిన వాగ్దానాలకు, చేపట్టిన చర్యలకూ అసలు పొంతన కుదరదు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలూ, 2022 నాటికే రైతులకు రెట్టింపు ఆదాయం వంటి ఎన్నో వాగ్దానాలు ఏమాత్రమూ ఆచరణకు నోచుకోలేదు. పైగా ఆ లక్ష్యాలకు విరుద్ధమైన విధానాలను అవలంబించటంతో పరిస్థితి మరింత దారుణంగా దిగజారిపోయింది. పదేళ్ల ముందుకన్నా ఇప్పుడు నిరుద్యోగం పెచ్చు పెరిగింది. ప్రోత్సాహకాలకు మంగళం పాడి, నల్ల చట్టాలను రంగంలోకి తేవడంతో వ్యవసాయరంగం ఉన్న కొద్దిపాటి భరోసాను కూడా కోల్పోయింది. పెద్ద నోట్ల రద్దు, జిఎస్టీ విధింపూ వంటి చర్యలూ కోట్లాది మంది ప్రజల జీవన స్థితిగతులను దెబ్బ తీశాయి తప్ప, ఇసుమంతైనా ఉద్ధరించింది లేదు. ఈ నేపథ్యంలో పదేళ్ల మోడీ ప్రభుత్వం చెప్పుకోవటానికి ఏ ఘనతా లేక, ప్రతిపక్షాల విమర్శలకు సమాధానం చెప్పలేక, ఎప్పటివలె ఎన్నికల్లోకి మతాన్ని లాక్కొస్తోంది. కనీస వివేచన, విచక్షణ లేకుండా అవాకులూ చెవాకులతో ప్రచారానికి దిగుతోంది. "మతమనేది వ్యక్తిగతం. దానిని వీధుల్లోకి, విమర్శల్లోకి తీసుకురాకండి." అని దేశ సర్వోన్నత న్యాయస్థానం గతంలో గట్టిగా నిర్దేశించినాబీ ఎన్నికల నిబంధనావళిలో స్పష్టంగా రాసుకున్నా బిజెపికి పట్టడం లేదు. సామరస్యాన్ని, సంయమనాన్ని పాటించాల్సిన ప్రధాని స్థాయి వ్యక్తి విద్వేష ప్రచారానికి ఆరంభం పలకటం మరింత దారుణం. మోడీ ఏ ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్నా- రాముడిని రాజకీయ దినుసుగా వాడబూనటం గర్హనీయం. రాముడికి ఆలయం కట్టనీయకుండా కాంగ్రెస్, ఆర్జేడీ అడ్డుకున్నాయంటూ బీహారులో ఏప్రిల్ 7న జరిగిన సభలో అసత్యాలు వల్లించారు. అయోధ్య రామాలయంలో ప్రాణ ప్రతిష్ట కార్యక్రమానికి హాజరైన తమ పార్టీ సభ్యులను కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు బహిష్కరించాయంటూ ఉత్తర ప్రదేశ్ సభలో పచ్చి అబద్ధాలు వండి వార్చారు. ఆ పార్టీలు రాముడిని అవమానించాయంటూ ప్రజలను రెచ్చగొట్టే విద్వేష ప్రసంగం చేశారు. అనేక రాష్ట్రాల్లో మోడీ ఈ పద్ధతిలోనే ప్రచారం సాగించటం తీవ్ర అభ్యంతరకరం. ప్రజల దైనందిన సమస్యలను పక్కనపెట్టి, సెంటిమెంట్లతో మద్దతు కూడగట్టాలనుకోవడం క్షమార్హం కాని మోసకారితనం. మోడీ దురుద్దేశపూర్వకంగా ఈ రెచ్చగొట్టుడు ధోరణిని కొనసాగిస్తున్నా ఎన్నికల సంఘం ఇప్పటివరకూ ఎలాంటి చర్యా తీసుకోలేదు. ఎన్నికల నియమావళిని గమనించినా, భారత శిక్షాస్మృతిని చూసినా మత సంబంధమైన అంశాలతో విద్వేష ప్రసంగాలు చేయటం శిక్షార్హమైన నేరం. పదే పదే ఎన్నికల కోడ్‌ని ఉల్లంఘిస్తున్న మోడీపై చర్యలు తీసుకోవాలని ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినా, ఇంతవరకూ అధికారుల నుంచి తగిన స్పందన లేదు. 2019 ఎన్నికల సమయంలోనూ మోడీ, కాషాయ పరివారపు విద్వేష ప్రచారంపై సిపిఎం ఫిర్యాదు చేసినా ఏ చర్యలూ తీసుకోలేదు. అప్పటి కమిషన్ ముగ్గురు సభ్యుల్లో ఒకరు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అభిప్రాయపడ్డా, మిగతా ఇద్దరూ అధికార పక్షానికి దాసోహమైనట్టు తరువాతి కాలంలో వార్తలొచ్చాయి.

# స్థానిక వార్తలు

## నువ్వు పంటను పరిశీలించిన మండల వ్యవసాయ అధికారి



**వాస్తవ నేస్తం,ఏర్గట్ల:** మండలములోని గుమ్మిర్యాల్ గ్రామంలో మండల వ్యవసాయాధికారి అబ్దుల్ మాలిక్ శుక్రవారం నువ్వు పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పంటకు వేరుకుళ్ళు. కాయ తొలుచు పురుగులు, వెర్రి తెగులు ఆశిస్తాయని వీటి నివారణకు కాపర్ ఆక్సీ కోరైడ్(సీవోసీ), ప్రొఫినోపాస్, ఇమిడా రోప్రిడ్ మందులను వాడుకోవాలని రైతులకు సూచించారు. ఆయన వెంట ఏఈవోలు సాయిసచిన్, స్నేహ, రైతులు ఉన్నారు.

## రైతులను మిల్లర్లు ఇబ్బందులకు గురి చేస్తే వెంటనే సమాచారం ఇవ్వండి

**అలాంటి వారి మిల్లులను బ్లాక్ లిస్టులో పెట్టాలని ఎమ్మార్వోకు, అడిషనల్ కలెక్టర్ కిషోర్ కుమార్ ఆదేశం**



**వాస్తవ నేస్తం,లోకేశ్వరం:** తూకం వేసిన ధాన్యాన్ని దింపుకునేందుకు మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురి చేస్తే వెంటనే తనకు సమాచారం ఇవ్వాలని అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ అన్నారు.అలాంటి మిల్లులను బ్లాక్ లిస్టులో పెట్టాలని ఎమ్మార్వో ను ఆదేశించారు. శుక్రవారం లోకేశ్వర్ మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి తూకం వేసిన వరి ధాన్యాన్ని పరిశీలించారు. ఐకెపి ఆధ్వర్యంలో అబ్దుల్లాపూర్ లో వారి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయగా ఇటీవల ఆ కేంద్రంలో తూకం వేసిన ధాన్యాన్ని సాత్ గాం ప్రాంతంలోని రైతు మిల్లుకు తరలించగా తాలు ,తప్ప ఉందనే సాకుతో రైస్ మిల్లు యజమాని 40 కిలోల కు అదనంగా ఒకటిన్నర కిలోలు ఇవ్వాలని లేనిచో లారీ నుండి ధాన్యాన్ని దింపుకొనేది లేదని చెప్పడంతో రైతులు అడిషనల్ కలెక్టర్, డిఆర్డిఏ పిడి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో శుక్రవారం ఆయన ఆ కేంద్రాన్ని సందర్శించారు. రైతులు కూడా నిబంధనల ప్రకారం ధాన్యంలో తాలు, తప్ప లేకుండా చూడాలని, 17 శాతానికి లోపు తేమ ఉండేలా ధాన్యాన్ని ఆరబెట్టాలని సూచించారు. మిల్లర్లు రైతుల నుండి అదనంగా ఒక్క గింజ డిమాండ్ చేసినా సహించేది లేదని, అలాంటి మిల్లులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనతోపాటు తహసిల్దార్ మోతిరాం, ఆర్ ఐ బాలకిషన్, ఐకెపి ఎపిఎం మల్లేష్, సీసీ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## మానవత్వాన్ని చాటుకున్న తోటి విద్యార్థులు



**వాస్తవ నేస్తం,లోకేశ్వర్:** మండల కేంద్రంలోని హరిజనవాడకు చెందిన పోతరాజు ప్రశాంత్ మద్యానికి బానిసై గత నెల 26న వైన్ షాప్ ఆవరణలో అనుమానస్పదంగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న 2007-2008 బ్యాచ్ కు చెందిన పదవ తరగతి తోటి విద్యార్థులు తన చిన్ననాటి మిత్రుడు మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ స్నేహితుడి కుటుంబాన్ని ఆదుకోవాలని దృఢ సంకల్పంతో తలో కొంత డబ్బులు జమ చేసి ,వారి కుటుంబానికి కుల పెద్దలు లక్ష్మణ్,శంకర్ సమక్షంలో రూ, 30500 లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సురేష్, సునీల్, గోపి, ఆజార్, రమేష్ , రవి వున్నారు.

## మరోసారి మోదీని ప్రధానమంత్రి చేయాలి



**వాస్తవ నేస్తం,లోకేశ్వరం:** మండలంలోని కనకాపూర్ గ్రామంలో వికాస్ భారత్ మన సంకల్పం ఆప్ కీ బార్ కార్యక్రమాన్ని మండల బీజేపీ నాయకులు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీలో పర్యటిస్తూ నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. రాబోవు ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి మరోసారి నరేంద్ర మోదీని ప్రధానమంత్రిని చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు సుమన్,ఓబిసి మోర్చా నిర్మల్ జిల్లా అధ్యక్షులు దడిగే భోజన్న ,చాకలి గోపి,కొత్తూర్ సంజు, గిర్మాయి చిన్న దేవన్న,గ్రామస్తులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కనకాపూర్‌లో నూతన నవగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం

## హనుమాన్ దీక్ష సేవ సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు





**వాస్తవ నేస్తం,నిర్మల్:** జిల్లాలోని లోకేశ్వరం మండలంలోని కనకాపూర్ గ్రామంలోని హనుమాన్ ఆలయ ప్రాంగణంలో నూతన నవగ్రహ విగ్రహాల ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు హనుమాన్ దీక్ష సేవ సమితి చేతుల మీదుగా నవగ్రహ ప్రతిష్టాపన పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా కొనసాగుతున్న పూజా కార్యక్రమం గ్రామ మహిళలంతా కలిసి మంగళ హారతులతో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. చిన్న పెద్ద తేడా లేకుండా గ్రామస్తులంతా ఏకమై ప్రధాన వీధుల గుండా నవగ్రహాల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ దీక్ష సేవ సమితి సభ్యులు మాట్లాడుతూ.... గ్రామస్తుల సహకారంతో దాతల సహకారంతో నవగ్ర విగ్రహ స్థాపన నిర్వహించారు అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు హిందువు పూజా కార్యక్రమాలతో పాటు మన సంస్కృతిని కాపాడాలని తమ పిల్లలని చక్కగా తీర్చిదిద్దాలని సంస్కృతితో సంప్రదాయాలు క్రమశిక్షణలు అలవాట్లు నేర్పాలని హిందూ ధర్మాన్ని కాపాడాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో ముధోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఉజ్జయిని మహారాజ్, బ్రహ్మేశ్వర మహారాజ్ శ్రీశ్రీశ్రీ బాలయోగి, వేదా పండితులు గ్రామస్తులు హనుమాన్ దీక్ష సేవ సమితి స్వాములు బీజేపీ నాయకులు గిర్మాయి చిన్న దేవన్న, చాకలి గోపి,బిసి మోర్చా నిర్మల్ జిల్లా అధ్యక్షులు తడిగా భోజన్న పిల్లలు మహిళలు పాల్గొన్నారు

# ప్రతి గ్రామానికి త్రాగు నీరు అందించాలి: జీవన్ పాటిల్ ఐఏఎస్



**వాస్తవ నేస్తం,గుడిహత్నూర్:** జిల్లా ప్రత్యేక అధికారి , స్పెషల్ సెక్రటరీ టు గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ జీవన్ పాటిల్ ఐఏఎస్ శుక్రవారం మండలంలోని డోంగర్గావ్, తోషం తాండ, పులిమడుగు , కుమ్మరి తండా గ్రామాలను సందర్శించారు.ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి గ్రామ ప్రజలను త్రాగునీటి సరఫరా గూర్చి వివరాలను అడిగి తెలుసుకొని కొన్ని గ్రామాలలో అపోహలతో ప్రజలు మిషన్ భగీరథ నీటిని తాగడం లేదని తమ దృష్టికి వచ్చిందని, మిషన్ భగీరథ నీటిని అందరూ తాగునీటి అవసరాలకు ఉపయోగించుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ నీరు ప్రతిరోజు సరఫరా కాని గ్రామాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సత్వరమే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామపంచాయతీ బోర్వెల్స్ ద్వారా నీటి సరఫరా అవుతున్న గ్రామాల్లో మే రెండవ వారం వరకు అడుగంటి పోయే బోర్లను గుర్తించి తదనుగుణంగా వ్యవసాయబోర్లను అద్దెకు తీసుకోవడం ద్వారా గాని, గ్రామ పంచాయతీ ట్యాంకర్లు అవసరమైతే ప్రైవేటు ట్యాంకర్ల ద్వారా గాని తాగునీటి సరఫరా చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు .పర్యటనలో అసిస్టెంట్ కలెక్టర్ వికాస్ మహతో ఐఏఎస్, మిషన్ భగీరథ ఎస్ ఈ సురేష్, ఈఈ చంద్రమోహన్, నీటిపారుదల ఎస్ ఈ ఈ విట్టల్ డి ఎల్ పి ఓ లు ఫనిందర్, ప్రభాకర్, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏఈలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## నవ్య భారతి విద్యార్థుల ప్రభంజనం

**వాస్తవ నేస్తం,ఏర్గట్ల:** శుక్రవారం వెలువడిన గురుకుల 5 వ తరగతి ప్రవేశ పరీక్షలో ఏర్గట్ల మండలం తాళ్ల రాంపూర్ నవ్య భారతి విద్యానికేతన్ విద్యార్థులు సత్తా చాటారు. 34 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, 30 మంది వివిధ గురుకులాలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రాజన్న తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు కరస్పాండెంట్ రాజాపూర్ణానందం, ఉపాధ్యాయ బృందం, పాఠశాల సిబ్బంది అభినందించారు.

## ప్రతీ బూత్ నుండి మెజారిటీ ఓట్లు సాధించాలి: సూర్యకాంత్ గిత్తే



**వాస్తవ నేస్తం,బజార్ హత్నూర్:** మండలంలోని ప్రతీ పోలింగ్ బూత్ నుండి మెజారిటీ ఓట్లను రాబట్టాలని బీజేపీ బోథ్ అసెంబ్లీ కన్వీనర్ సూర్యకాంత్ గిత్తే అన్నారు.

శుక్రవారం మండలంలోని దేగమ గ్రామంలో శక్తి కేంద్రం ఇంచార్జ్ లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఒక్కో శక్తి కేంద్రం ఇంచార్జీ కి 6 పోలింగ్ బూత్ లను కేటాయించారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు పార్టీకోసం పూర్తి సమయం కేటాయించాలని అన్నారు. మండల అధ్యక్షులు పోరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలను, సాధించిన విజయాలను గడపగడపకు తీసుకుని వెళ్లాలని ఒక్కో ఓటర్ని కనీసం 4 సార్లు కలిసేలా చూడాలని అన్నారు. పార్లమెంట్ అభ్యర్థి గోడం నగేష్ భారీ మెజారిటీతో గెలవడం ఖాయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బోథ్ అసెంబ్లీ కో కన్వీనర్ కధం బాబురావు పటేల్, మండల ప్రధాన కార్యదర్శి పెరుగు సంతోష్, శక్తి కేంద్రం ఇంచార్జీ లు బలిరా%శీ%, మడావి ప్రకాష్, ఆడే శ్రీరామ్, షేక్ రజాక్ లు పాల్గొన్నారు.

## బూడిద లారీలను నియంత్రించండి

## ఇల్లంద గ్రామస్థుల అందోళన

**వరంగల్ :** వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో డస్ట్ లారీలతో స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఖమ్మం రహదారిపై గ్రామస్తులు ధర్నా నిర్వహించారు. బూడిద రవాణా లారీలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై గ్రామస్తులు ఆందోళనకు దిగారు. గత కొన్ని రోజులుగా వందలాది లారీలలో రామగుండం నుండి ఖమ్మం వైపు బొగ్గు బూడిద తరలిస్తున్నారు. ఈ క్రమంలో సరైన జాగ్రత్త చర్యలు తీసుకోకపవడం వల్ల ఆ బూడిద జాతీయ రహదారిపై పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వర్ధన్నపేట మండలం ఇల్లంద జాతీయ రహదారిపై గ్రామస్తులు ఆందోళన చేశారు బొగ్గు బూడిద కారణంగా వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయని.. వాహనాలు వేగానికి బూడిద కళ్ళల్లో పడి అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి బొగ్గు బూడిద రవాణాను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గ్రామస్తుల ఆందోళన లతో సుమారు గంటన్నర పాటు వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆందోళనకారులకు సర్దు చెప్పి

## రాష్ట్ర వ్యాప్తంగా మొదలైన నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే



**వాస్తవ నేస్తం,పెద్దపల్లి:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే నిర్వహించడం జరగనుంది పెద్ద పల్లి జిల్లా లోని అప్పన్న పేటలో మూడు నుండి నాలుగు రోజుల పాటు నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే బృందం ఆరోగ్య సెర్వె నిర్వహిస్తారు ఎంపికైన దాదాపు ఇరవై రెండు కుటుంబాల యొక్క స్థితి గతులు వారి ఆర్థిక విధానాలు మరియు వారి ఆరోగ్య పరిస్థితిల గురించి ప్రభుత్వ నికి నివేదికను అందజేయడం ఈ బృందం కార్యాచరణ నిర్వహింస్తోంది ఆరోగ్య సర్వేలో ఎంపికైన కుటుంబాలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరగనుంది.జాతీయ కుటుంబ ఆరోగ్యసర్వే బృందం గ్రామంలో మూడు రోజుల పాటు అక్కడే ఉండి సెర్వె నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ రాజేందర్ రెడ్డి, ఇన్విజిగేటర్లు, భార్గవి, నికిత, మహేష్ ప్రమీల, హెల్త్ ఇన్విస్టిగేటర్ లు నవ్యశ్రీ, నిశాంత్ ఆశ కార్యకర్తలు, పాల్గొన్నారు.

## శాంతిఖని గనిలో సైకిల్ ర్యాలీ




**వాస్తవ నేస్తం,బెల్లంపల్లి:** మినిస్ట్రీ ఆఫ్ కోల్ మరియు తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఆదేశానుసారం పర్యావరణ పరిరక్షణలో భాగంగా సింగరేణి కంపెనీ అన్ని ఏరియాల్లో ఏప్రిల్ 18 నుండి జూన్ 5 వ తేదీ వరకు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలియజేశారు. అందులో భాగంగా నేడు శాంతిఖని గనిలో పర్యావరణ పరిరక్షణ కొరకు సైకిల్ ర్యాలీ షాఫ్ట్ నుండి ఫ్యాన్ హౌస్ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి ఆర్. విజయప్రసాద్, గ్రూప్ ఇంజనీర్ బసవరాజు, మేనేజర్ సంజయ్ కుమార్ సిన్హా, పిట్ ఇంజనీర్ రాంబాబు, బీఎం ఇంచార్జి ముస్తఫా, వెంటిలేషన్ అధికారి పూర్ణచందర్, సంక్షేమ అధికారి సత్యనారాయణ, ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి తిరుపతి గౌడ్, గని అధికారులు, యూనియన్ నాయకులు మరియు ఉద్యోగులు పాల్గొన్నారు.

# బొంబాయి రవ్వతో ఇన్ని ప్రయోజనాలా?



ప్రస్తుతం ఆరోగ్యం పెద్ద సవాలుగా మారుతుంది. మారుతున్న జీవన శైలి, వాతావరణం, ఆహార అలవాట్ల విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే సమస్యలు ఎదుర్కోవాల్సిందే.రసాయనాలతో కూడిన ఆహారాల వల్ల ఆరోగ్య సమస్యలు చుట్టుముడుతున్నాయి. ముఖ్యంగా ఎక్కువ ఫ్రై చేసిన ఆహారం, మాసాలు తినడం వల్ల సమస్యలు వస్తున్నాయి. కానీ ఒకసారి మీరు మీ ఆహారంలో మంచి డైట్ ను పాటిస్తే కచ్చితంగా ఆస్పత్రి వెళ్లాల్సిన అవసరం రాదు అంటున్నారు నిపుణులు. వంటింట్లో చాలా మంది రవ్వను ఉపయోగిస్తుంటారు. అందులో ముఖ్యంగా బొంబాయి రవ్వ ఉంటుంది. మరి ఈ బొంబాయి రవ్వలో ఎన్ని ప్రయోజనాలు ఉన్నాయో తెలిస్తే కచ్చితంగా మీ డైట్ లో భాగం చేసుకుంటారు. మరి ఓసారి తెలుసుకుందామా? బొంబాయి రవ్వలో కాల్షియం, విటమిన్స్, ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల మీకు మరింత మేలు చేస్తాయి. అరబొనాక్సినిన్ అనే శక్తివంతమైన ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి మీ ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. అందుకే బొంబాయి రవ్వాను మీ డైట్ లో భాగం చేసుకోండి.అరబొనాక్సినేట్లు కొలెస్ట్రాల్ ను కంట్రోల్ లో ఉంచుతుంది. ఇక షుగర్ లెవల్స్ ను కంట్రోల్ చేస్తుంది కాబట్టి బొంబాయి రవ్వ షుగర్ పేషెంట్లకు చాలా మంచిది. ఇందులోని మెగ్నీషియం, టొకొఫెరోల్, ఫెనాన్స్ రక్తపోటును నియంత్రిస్తుంది. దీని వల్ల గుండె సమస్యలు వచ్చే ఆస్కారం తక్కువగా ఉంటుంది. ఇక ఇందులోని ఫైబర్ జీర్ణక్రియ సమస్యలను నయం చేస్తుంది. దీని వల్ల మలబద్ధకం సమస్య కూడా దూరం అవుతుంది. ఇందులో ఉండే ఫాస్పరస్ ఎముకలను బలంగా ఉంచుతుంది. ఫాస్పరస్ వల్ల మీ దంతాల ఆరోగ్యం కూడా పదిలంగా ఉంటుంది. మరి కేవలం ఉక్మా అని తీసి పారేస్తున్నారా? ఒక్కసారి బొంబాయి రవ్వను తింటే మీకు వచ్చే ఎన్నో సమస్యలకు మీరు చెక్ పెట్టవచ్చు. ఇలాంటి రవ్వను ఛీ, ఉక్మా అంటూ పక్కన పెడుతుంటారు. ఉక్మా లేదా మరే ఇతర పదార్థాలు అయినా చేసుకొని తినండి. మీ ఆరోగ్యాన్ని తక్కువ ధరతోనే సేఫ్ గా ఉంచుకోండి.

# మొటిమలు విటమిన్ లోపం వల్ల వస్తాయా?



మొహం అందంగా ఉంటేనే ఎవరికి అయినా నచ్చుతుంది. కొంచెం మొటిమలు, మచ్చలు ఉంటే ఇబ్బందిగా అనిపిస్తుంది. ఒకసారి మొటిమలు వస్తే దాని తాలుకు మచ్చలు పోవడం కూడా కష్టమే.మొటిమలు ఉంటే కొందరు ఇతరుల మధ్య మాట్లాడటానికి కూడా ఇబ్బందిగానే ఫీల్ అవుతారు. వీటి సమస్య నుంచి బయటపడటానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటారు. ఎవరు ఏ క్రీమ్ గురించి చెబితే ఆ క్రీములను వాడుతుంటారు. కానీ మొటిమల సమస్య నుంచి దూరం అవడం అంత సులభమైన పని కాదు.అదనపు జిడ్డు వల్ల మృతకణాలు బ్యాక్టీరియా చర్మరంధ్రాలలో పేరుకొనిపోయి మొహం మీద మొటిమల రూపంలో వస్తుంటాయి. అయితే ఈ సమస్యకు కూడా విటిమిన్ లు కారణం అంటున్నారు నిపుణులు. విటమిన్ ల లోపం వల్ల మొటిమల సమస్య వచ్చే ఆస్కారం ఎక్కువగా ఉంటుందట. విటమిన్ ఏ లేకపోవడం వల్ల మొటిమలు వస్తాయి. ఇది ఒకరకమైన యాంటీ ఆక్సిడెంట్ ల ఉంటుంది. ఇది మన చర్మాన్ని కాపాడటానికి చాల ముఖ్యంగా పనిచేస్తుంది. ఈ లోపం మీలో ఉంటే పచ్చిమిర్చి, టమోటాలు, క్యారెట్ లను మీ డైట్ లో భాగం చేసుకోండి. విటమిన్ బీ3 లోపం వల్ల కూడా మొటిమల సమస్య ఉంటుంది. ఈ విటమిన్ యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటుంది. దీని లోపం వల్ల మొటమలు వస్తాయి. అయితే ఈ విటమిన్ వల్లనే చర్మ కాంతి మరింత మెరుగ్గా ఉంటుంది. ఇక విటమిన్ డి రోగనిరోధక శక్తిని పెంచుతుంది అనే విషయం తెలిసిందే. దీనివల్ల కూడా మొటిమల సమస్యలు వస్తాయి. ఇక ఈ విటమిన్ లోపం ఉండకూడదు అంటే పాలు, గుడ్లు వంటివి తీసుకోవాలి. ఆరోగ్యకరమైన చర్మానికి విటమిన్ ఇ ప్రధాన పాత్ర పోషిస్తుంటుంది. ఇందులో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు పుష్కలంగా ఉంటాయి. విటమిన్ ఇ కొల్లాజెన్ ను నిర్మించడం వల్ల చర్మ ఆరోగ్యాన్ని రక్షిస్తుంది. దీని వల్ల చర్మ కాంతి కూడా మీ సొంతం అవుతుంది. మరి తెలుసుకున్నారు కదా ఏ విటమిన్ ల వల్ల మొటిమలు వస్తాయో.. ఓసారి ఈ విటమిన్ లోపం ఉందో చెక్ చేసుకొని వాటి కోసం తగిన ఆహారం తీసుకోండి

# మధుమేహులకు మోదుగ పూలతో వైద్యం..!






డయాబెటిస్ అనేది సైలెంట్ కిల్లర్ వ్యాధి. ఇది గత కొన్ని సంవత్సరాలుగా ప్రపంచానికి పెద్ద ముప్పుగా ఉద్భవించింది. ముఖ్యంగా భారతదేశంలో ఈ తీవ్రమైన వ్యాధి బాధితుల సంఖ్య నిరంతరం పెరుగుతోంది.ఇంకా ఆందోళన కలిగించే విషయమేమిటంటే మధుమేహానికి మందు లేదు. అటువంటి పరిస్థితిలో బాధితుడు తన జీవితాంతం మందులపై ఆధారపడవలసి ఉంటుంది. ఒక్కసారి మధుమేహం వస్తే దాన్ని పూర్తిగా నయం చేయడం సాధ్యం కాదు. అయితే, ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడం ద్వారా మీ ఆహారంలో కొన్ని ప్రత్యేక అంశాలను చేర్చుకోవడం ద్వారా మధుమేహాన్ని చాలా వరకు నియంత్రించవచ్చు. అయితే, ఆయుర్వేదంలో సూచించిన అనేక మూలికలు బ్లడ్ షుగర్‌ను కంట్రోల్‌లో ఉంచుతాయని సూచించారు. వీటిని తీసుకోవడం ద్వారా ఈ తీవ్రమైన వ్యాధిని చాలా వరకు అదుపులో ఉంటుందని చెబుతున్నారు. వీటిలో ఒకటి మోదుగ పువ్వు. ఈ పువ్వులతో చేసిన నీటిని ఖాళీ కడుపుతో తాగడం వల్ల బ్లడ్ షుగర్ అదుపులోకి వస్తుంది.మోదుగ చెట్టు.. త్రిమూర్తులకు అంటే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు నివాసంగా పరిగణిస్తారు. మోదుగ పువ్వుల అందం ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది. అలాంటి మోదుగ పువ్వులు యాంటీ హైపర్గ్లైసీమిక్ లక్షణాలను కలిగి ఉంటాయి. కాబట్టి అవి రక్తంలో చక్కెర స్థాయిలను త్వరగా నియంత్రించడంలో ప్రభావవంతంగా పనిచేస్తాయి. ఇందుకోసం రెండు మోదుగ పువ్వులను తీసుకుని వాటిని శుభ్రం చేసుకోవాలి.. ఒక బౌల్‌లో 2 కప్పుల నీటిని మరిగించాలి. గ్యాస్‌ను ఆపివేసి, ఈ పువ్వులను వేడి నీటిలో వేయండి. ఆ తరువాత దానిపై మూతపెట్టి ఒక రాత్రంతా అలాగే వదిలేయండి. ఉదయం నిద్రలేచిన తర్వాత ఈ నీటిని వడకట్టి తాగేయాలి. ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో ఈ నీటిని తాగుతూ ఉంటే.. బ్లడ్ షుగర్ అదుపులోకి వస్తుంది.

# ఆ సమస్యలకు బ్రహ్మాస్త్రం ఈ పండు..

బొప్పాయి.. ఒక రుచికరమైన, ఆరోగ్యకరమైన పండు.. ఇందులో పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. విటమిన్ ఎ, విటమిన్ సి, పాపైన్, ఫైబర్ వంటి మూలకాలు ఇందులో ఉంటాయి. బొప్పాయి తినడానికి రుచిగా ఉండటమే కాకుండా మీ ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుంది.. మీరు బొప్పాయిని మీ ఆహారంలో అనేక విధాలుగా చేర్చుకోవచ్చు. అయితే ఉదయం వేళ ఖాళీ కడుపుతో దీన్ని తీసుకోవడం ప్రయోజనకరంగా ఉంటుందని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. అయితే, కొంతమందిక బొప్పాయిని ఖాళీ కడుపుతో తినడం హానికరమని కూడా హెచ్చరిస్తున్నారు. బొప్పాయిని ఖాళీ కడుపుతో తింటే కలిగే ఆరోగ్య ప్రయోజనాలతోపాటు.. ఎవరు బొప్పాయిని తినకూడదో ఇప్పుడు తెలుసుకోండి..చీ×ఎ లో ప్రచురించబడిన ఒక అధ్యయనం ప్రకారం.. బొప్పాయిలో ఉండే పాపైన్ అనే ఎంజైమ్ జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఈ ఎంజైమ్ ప్రోటీన్లను విచ్ఛిన్నం చేయడంలో సహాయపడుతుంది. దీని కారణంగా ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. బొప్పాయిని ఖాళీ కడుపుతో తినడం ద్వారా, ఈ ఎంజైమ్ మరింత ప్రభావవంతంగా పనిచేస్తుంది.. దీంతో గ్యాస్, అజీర్ణం, మలబద్ధకం వంటి సమస్యల నుంచి మీకు ఉపశమనం కలిగిస్తుంది. బొప్పాయి ఒక సహజమైన డిటాక్సిఫైయింగ్ ఏజెంట్.. ఇందులో ఉండే ఫైబర్, విటమిన్ సి శరీరంలోని టాక్సిన్స్ ను తొలగించడంలో సహాయపడుతుంది. అటువంటి పరిస్థితిలో, ఉదయం ఖాళీ కడుపుతో బొప్పాయి తినడం వల్ల ఈ ప్రక్రియను వేగవంతం చేస్తుంది. ఇది శరీరంలోని టాక్సిన్స్ మొత్తాన్ని తగ్గిస్తుంది.. మంచి ఆరోగ్యాన్ని కలిగిస్తుంది. బొప్పాయిలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది శరీరం రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. బొప్పాయిని ఖాళీ కడుపుతో తినడం ద్వారా, విటమిన్ సి నేరుగా రక్తప్రవాహంలోకి చేరుతుంది. ఇది ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి శరీరానికి శక్తిని ఇస్తుంది. బొప్పాయి తక్కువ కేలరీలు, ఫైబర్ అధికంగా ఉండే పండు. ఇది ఆహారాన్ని త్వరగా జీర్ణం చేయడంలో సహాయపడుతుంది. ఎక్కువసేపు కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. ఇది మీరు తక్కువ తినేలా చేయడంతోపాటు బరువు తగ్గడానికి సహాయపడుతుంది.



# అరటి తొక్కతో అద్భుతమైన ప్రయోజనాలు..



చర్మ సమస్యల నుండి బయటపడటానికి ప్రజలు ఖరీదైన సౌందర్య సాధనాలను, సౌందర్యం కోసం రకరకాల చికిత్సలను ఆశ్రయిస్తారు. ఇది చాలా డబ్బు ఖర్చు చేయడమే కాకుండా మీ చర్మంపై దుష్ప్రభావాల భయాన్ని కలిగి ఉంటుంది.అదే సమయంలో సహజ వస్తువులు చౌకగా ఉంటాయి. ఎటువంటి హాని కలిగించవు. అరటిపండు మీ ఆరోగ్యానికి, చర్మానికి మాత్రమే కాదు, దాని పై తొక్క మీ చర్మానికి కూడా చాలా మేలు చేస్తుంది. చాలా మంది ప్రజలు అరటి తొక్కను విసిరివేస్తారు, అయితే పండిన అరటి తొక్క మీకు అనేక చర్మ సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది మరియు చర్మాన్ని ఆరోగ్యంగా మార్చడంలో సహాయపడుతుంది. కాబట్టి దానిని ఉపయోగించడానికి సరైన మార్గం ఏమిటో మాకు తెలియజేయండి. అరటి తొక్కలో ఫైబర్, ఐరన్, కాల్షియం, విటమిన్ దీ6, దీ12, జింక్, మెగ్నీషియం, అనేక ఇతర యాంటీఆక్సిడెంట్లు కూడా ఉన్నాయి. ఇవి చర్మాన్ని మెరిసేలా చేయడంలో సహాయపడతాయి. మీరు అరటి తొక్క లోపలి భాగంతో మీ చర్మాన్ని మసాజ్ చేయవచ్చు. ఇది లోతైన శుభ్రపరిచే పనిని చేయడమే కాకుండా చర్మాన్ని మృదువుగా చేస్తుంది. అరటి తొక్క లోపలి భాగంలో తేనెను అప్లై చేయడం ద్వారా మీ ముఖానికి మసాజ్ చేయవచ్చు. 8 నుండి 10 నిమిషాల పాటు వృత్తాకార కదలికలో ముఖాన్ని మసాజ్ చేసి, 20 నిమిషాలు అలాగే ఉంచండి. దీని తర్వాత ముఖం కడుక్కోవాలి. ఇది మీ చర్మానికి మెరుపును తీసుకురావడమే కాకుండా మచ్చలు, ఫైన్ లైన్స్ సమస్య నుండి ఉపశమనం కలిగిస్తుంది. చాలా మందికి వేళ్లు, కాలి వేళ్లు, మోచేతులు, మోకాళ్లు వంటి ప్రదేశాల్లో చర్మం నల్లబడటం అనే సమస్య ఉంటుంది. అరటిపండు తొక్కతో కూడా మీ ఈ సమస్యను పరిష్కరించవచ్చు. దీని కోసం అరటిపండు తొక్క లోపలి భాగంలో చిటికెడు పసుపు, కొద్దిగా పంచదార తీసుకుని ప్రభావిత ప్రాంతాల్లో వృత్తాకారంలో మసాజ్ చేయాలి. ఇది మృత చర్మ కణాలను క్లియర్ చేస్తుంది. అలాగే క్రమంగా చర్మం నలుపు కూడా పోతుంది.

# స్థానిక వార్తలు

## టైమ్స్ జాబితాలో 'సత్య నాదెళ్ల'కు చోటు



ప్రపంచంలోనే 100 మంది ప్రభావశీలుర జాబితా-2024లో మన దేశానికి చెందిన పలువురు ప్రముఖులు చోటు సంపాదించారు. వీరిలో ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు అజయ్ బంగా, మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల, బాలీవుడ్ నటి ఆలియా భట్, రెజ్లర్ సాక్షి మాలిక్, నటుడు దేవ్ పటేల్ తదితరులు ఉన్నారు. ఈ జాబితాలో మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్లకు ప్రత్యేక స్థానం ఉంది. టెక్నాలజీ పెరుగుతున్న తరుణంలో మైక్రోసాఫ్ట్ వినియోగదారులకు మెరుగైన సేవలిందించేందుకు కృషిచేస్తోంది. సత్య సీఈవోగా బాధ్యతలు చేపట్టి ఈ ఏడాది ఫిబ్రవరితో పదేళ్లు ముగిసింది. ఈ కాలంలో చాలా మార్పులు తీసుకొచ్చారు. ఆయన బాధ్యతలు చేపట్టిన తర్వాత క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ(ఏఐ)పై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించి కార్యకలాపాలను పరుగు పెట్టించారు. దీంతో మైక్రోసాఫ్ట్ మార్కెట్ విలువ పెరిగింది. గత పదేళ్ల కాలంలో మైక్రోసాఫ్ట్ వాటాదార్ల సంపద దాదాపు 3 ట్రిలియన్ డాలర్లకు చేరింది. సత్య నాదెళ్ల సీఈఓగా బాధ్యతలు చేపట్టిన నాడు 10,000 డాలర్లు పెట్టి మైక్రోసాఫ్ట్ షేర్లు కొనుగోలు చేస్తే, ప్రస్తుతం వాటి విలువ 1,13,000 డాలర్లు అయ్యేది. ఈ సమయంలో 'అజూర్' క్లౌడ్ కంప్యూటింగ్ ప్లాట్‌ఫామ్‌ను ఆవిష్కరించారు. ఒక చిన్న అంకుర సంస్థకు మైక్రోసాఫ్ట్‌తో అవసరం ఉండదు, కానీ అటువంటి సంస్థలన్నింటినీ ఓపెన్ ఏఐ ద్వారా అజూర్ ప్లాట్‌ఫామ్ మీదకు తీసుకురాగలిగారు. దీంతో గూగుల్, అమెజాన్‌లతో పోల్చితే మైక్రోసాఫ్ట్ పైచేయి సాధించే అవకాశం ఏర్పడింది. విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్ మీద లభించే రాయల్టీపై ఆధారపడటాన్ని తగ్గించారు.

## శిశు ఆహార ఉత్పత్తుల్లో చక్కెర 30% తగ్గించాం




భారత్‌లో శిశువుల కోసం తయారు చేస్తున్న ఆహార ఉత్పత్తుల్లో చక్కెర శాతాన్ని గత అయిదేళ్లలో 30 శాతానికి పైగా తగ్గించామని నెస్లే ఇండియా పేర్కొంది.అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే, వర్ధమాన దేశాల్లో తయారు చేస్తున్న ఉత్పత్తుల్లో ఎక్కువ చక్కెరను ఉపయోగిస్తోందని ఈ సంస్థపై ఆరోపణలు రావడంతో, తాజాగా వివరణ ఇచ్చింది.ఇంతకీ ఏం జరిగిందంటే..: ఐరోపా దేశాలతో పోలిస్తే భారత్ సహా దక్షిణాసియా దేశాలు, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల్లో నెస్లే విక్రయిస్తున్న బేబీ ప్రోడక్ట్స్‌లో చక్కెర శాతం అధికంగా ఉంటోందని స్విట్జర్లాండ్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ పబ్లిక్ ఐ అండ్ ఇంటర్నేషనల్ బేబీ ఫుడ్ యాక్షన్ నెట్‌వర్క్(ఐబీఎఫ్ఏఎన్) ఆరోపించింది. వేర్వేరు దేశాల్లో నెస్లే విక్రయిస్తున్న 150 వరకు బేబీ ఉత్పత్తులను పరిశీలించినట్లు ఈ సంస్థ పేర్కొంది. ఈ సంస్థ నివేదిక ప్రకారం.. బ్రిటన్, జర్మనీలలో 6 నెలల శిశువుల కోసం అమ్మే సెరిలాక్‌లో ఎటువంటి చక్కెరనూ నెస్లే కలపలేదు. భారత్‌లో మాత్రం 15 సెరిలాక్ ఉత్పత్తుల్లో 2.7 గ్రాముల (ఒక్కో సర్వింగ్‌కు) చక్కెర ఉంది. ప్యాక్‌లపై ఈ కంటెంట్‌ను ప్రకటించారు. సమీక్షించి, చర్యలు తీసుకుంటున్నాం.. నెస్లే ప్రతినిధి: 'నెస్లే ఇండియా గత అయిదేళ్లలో రకాన్ని బట్టి 30% వరకు చక్కెరను తగ్గించాం. ఎప్పటికప్పుడు మా ఉత్పత్తులను సమీక్షిస్తూ, రీఫార్ములేట్ చేస్తూ చక్కెర స్థాయిలను తగ్గిస్తాం. పోషకాలు, నాణ్యత, భద్రత, రుచి విషయంలో ఎటువంటి రాజీ పడకుండా ఈ పనిచేస్తుంటాం' అని నెస్లే ఇండియా ప్రతినిధి వివరించారు.

# గూగుల్‌లో నిరసనగళం త్వరలో భారీగా ఉద్వాసనలు!

ఇరాన్, ఇజ్రాయిల్ మధ్య యుద్ధ ఆందోళనలు తుదకు కార్పొరేట్ సంస్థలను తాకాయి. ఈ అంశంలో ఏకంగా టెక్ దిగ్గజం గూగుల్ ప్రాజెక్టుపై ఆ సంస్థ ఉద్యోగులే నిరసనగళం ఎత్తారు. గూగుల్ ఉద్యోగులు కంపెనీ క్లౌడ్ సిఇఒనే ఎదురించడం విశేషం. ఇజ్రాయిల్‌తో క్లౌడ్ కంప్యూటింగ్ కాంట్రాక్ట్ ప్రాజెక్ట్ నింబస్‌ను వ్యతిరేకిస్తూ సిబ్బంది ఆందోళన చేపట్టారు. ఈ కాంట్రాక్ట్‌కు వ్యతిరేకంగా ఉద్యోగులు ఇటీవల న్యూయార్క్, సన్నీవేల్‌లోని రెండు గూగుల్ కార్యాలయాల ఎదుట ధర్నా చేశారు. అంతకుముందు మంగళవారం గూగుల్ క్లౌడ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ) థామస్ కురియన్ కార్యాలయాన్ని 8 గంటల పాటు ముట్టడించి అక్కడి నుంచి కదిలేందుకు నిరాకరించారు. ఏకంగా రూ.10వేల కోట్ల ప్రాజెక్ట్‌ను ఉపసంహరించుకోవాలంటూ డిమాండ్ చేశారు. ఇజ్రాయెల్‌తో కంపెనీ చేసుకున్న ఒప్పందాలను వెంటనే నిలిపేయాలని కోరారు. నిరసనకు దిగిన ఉద్యోగులను ఆ కంపెనీ అరెస్ట్ చేయించింది. అనంతరం 28 మంది ఉద్యోగులను గూగుల్ తొలగించింది. అమెరికా దన్నుతో ఇతర దేశాలపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా పోరటం చేయడం టెక్ కార్పొరేట్ చరిత్రలోనే విశేషం. ఆందోళనలో పాల్గొన్న ఉద్యోగులను అడ్మినిస్ట్రేటివ్ లీవ్‌లో ఉంచినట్లు కంపెనీ తెలిపింది. అయినా అక్కడి నుంచి



ఏమాత్రం నిరసన విరమించుకోకపోవడంతో 28 మందిపై వేటు వేసినట్లు ప్రకటించింది. ఇజ్రాయెల్ ప్రభుత్వంతో గతంలో గూగుల్ క్లౌడ్ కంప్యూటింగ్ 1.2 బిలియన్ డాలర్ల ప్రాజెక్ట్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఉద్యోగుల ప్రధాన డిమాండ్.

## చట్టబద్ధతలేని కంపెనీల వల్ల రూ.20 వేలకోట్ల జీఎస్‌టీ నష్టం

భారత్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న విదేశీ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ కంపెనీలపై ప్రభుత్వం చర్యలకు పూనుకుంది. ఆయా బెట్టింగ్ సంస్థల వల్ల ప్రభుత్వానికి 2.5 బిలియన్ డాలర్లు(రూ.20వేలకోట్లు) నష్టం కలుగుతోందని అఖిల భారత గేమింగ్ సమాఖ్య (ఏఐజీఎఫ్) తెలియజేసింది. విదేశీ కంపెనీలు భారత్‌లో తమ సంస్థలకు చెందిన ప్లాట్‌ఫామ్‌ల్లో చట్టవ్యతిరేక బెట్టింగ్, గ్యాంబ్లింగ్ గేమ్‌లను అందిస్తున్నాయి. అయితే వాటికి చట్టబద్ధత లేకపోవడంతో చాపకింద నీరులా అవి విస్తరిస్తున్నాయి. ఆ కంపెనీలకు చెందిన ప్లాట్‌ఫామ్‌లు వినియోగిస్తున్న వారు చట్టబద్ధత ఉన్నావాటికి లేని వాటిని మధ్య తేడాను గ్రహించలేకపోతున్నారని ఏఐజీఎఫ్ సీఈఓ రోలండ్ లాండర్స్ తెలిపారు. ఇలా విదేశీ కంపెనీలు భారత్‌లోని చట్టబద్ధ గేమింగ్ పరిశ్రమకు హాని కలిగించడంతో పాటు వినియోగదార్లకు నష్టం కలిగేంచేలా వ్యవహరిస్తున్నాయని ఆయన అన్నారు. ఈ ఆఫ్‌షోర్ ప్లాట్‌ఫామ్స్ ఏటా 12 బిలియన్ డాలర్ల (సుమారు రూ.లక్ష కోట్ల) వరకు యూజర్లు, ప్రకటన కంపెనీల నుంచి డిపాజిట్లను వసూలు చేస్తున్నాయి. అంటే జీఎస్‌టీ రూపంలో 2.5 బిలియన్ డాలర్ల(రూ.20వేల కోట్లు) మేర కేంద్రానికి



నష్టం జరుగుతోందని చెప్పారు. ఇలాంటి కంపెనీలపై ప్రభుత్వం చర్యలు తీసుకోబోతుందన్నారు. చాలా సంస్థలు ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ సీజన్‌లో వ్యాపార ప్రకటనలు పెంచాయి. తమ ప్లాట్‌ఫారాలపై జీఎస్‌టీ/ టీడీఎస్ వర్తించదనీ చెబుతున్నాయన్నారు. దాంతో ఆయా గేమింగ్ ప్లాట్‌ఫారాల్లో ప్రకటనలకోసం కంపెనీలు ఆసక్తి చూపుతున్నట్లు తెలిసింది.

# బంతిపై అంత కసి ఎందుకో.. ఫినిషర్‌గా వరల్డ్ కప్ ఆడేదెవరో?

ఐపీఎల్ పదిహేడో సీజన్‌లో అన్నీ శుభశకునములే కనిపిస్తున్నాయి. ప్రతి సీజన్‌లో ఒక కొత్త స్టార్ పుట్టుకొచ్చినట్టే.. ఈ సీజన్‌లోనూ కొత్త స్టార్ ఆవిర్భవించాడు. అతడే అశుతోష్ శర్మ మెగా టోర్నీలో రెప్పపాటులో విధ్వంసం సృష్టిస్తున్న ఈ యంగ్‌స్టర్ పంజాబ్ కింగ్స్ విజయాల్లో తన ముద్ర వేస్తున్నాడు. ఈ కుర్ర హిట్టర్ ఆటకు స్టేడియాలు దద్దరిల్లిపోతున్నాయ్.. బౌలర్లు ఎక్కడ బంతులు వేయాలి? అని తలలు పట్టుకుంటున్నారు. దాంతో, టీమిండియా నయా ఫినిషర్‌గా చాన్స్ కోసం కర్చీఫ్ వేసిన రింకూ సింగ్ రియాన్ పరాగ్ శివం దూబేలకు అశుతోష్ గట్టి పోటీనిస్తున్నాడు. పదిహేడో సీజన్‌లో బంతిపై కసితో కొడుతున్న ఈ యంగ్‌స్టర్ వరల్డ్ కప్ జట్టులో ఉండాలని మాజీలంతా ముక్తకంఠంతో కోరుతున్నారు. టీ20 వరల్డ్ కప్ బృందం ఎంపికపై భారీగా కసరత్తు చేస్తున్న టీమిండియా సెలెక్టర్లకు కుర్రాళ్లు సవాల్ విసురుతున్నారు. ఒకరిని మించి ఒకరు తమ పవర్ హిట్టింగ్‌తో బిత్తరపోయేలా చేస్తున్నారు. ఇప్పటివరకూ ఫినిషర్‌గా రింకూ సింగ్, రియాన్ పరాగ్, శివం దూబేలలో ఒకరు ఖాయం అనుకుంటుండగా.. నేనూ రేసులో ఉన్నానంటూ దూసుకొచ్చాడు కొత్త కెరటం అశుతోష్ శర్మ. ఎనిమిదో స్థానంలో సంచలన ఇన్నింగ్స్‌లు ఆడుతున్న ఈ హిట్టర్.. పంజాబ్‌కు కొండంత భరోసానిస్తున్నాడు.

అశుతోష్ లెక్క తప్పని టైమింగ్, ఫుల్ షాట్లతో సిక్సర్లు బాదడం, బుమ్రా బౌలింగ్‌లో స్వీప్ షాట్ ఆడడం.. ఇవన్నీ అద్భుతం అంటున్నారు క్రికెట్ విశ్లేషకులు. అయితే.. ఈ సీజన్‌లో మెరుపులు మెరిపిస్తున్న దూబే, సిక్సర్ల రింకూ, నిలకడగా రాణిస్తున్న పరాగ్‌లను దాటుకొని వరల్డ్ కప్ బృందంలో చోటు దక్కించుకుంటాడా? అనేది తెలియాల్సి ఉంది.




**సంచలన ఇన్నింగ్స్‌లకు కేరాఫ్**

పదిహేడో సీజన్‌లో రింకూ మెరుపులు అంతగా కనిపించట్లే. దూబే, పరాగ్‌లు మాత్రం ఓ రేంజ్లో ఆడుతూ బౌలర్ల వెన్నులో వణుకుపుట్టిస్తున్నారు. ఇప్పుడు ఈ ఇద్దరు ఫినిషర్ స్థానం కోసం పోటీపడుతున్న వేళ.. అశుతోష్ సంచలన ఇన్నింగ్స్‌లకు కేరాఫ్ అయ్యాడు. మ్యాచ్ మ్యాచ్‌కు రాటుదేలుతున్న ఈ రైట్ హ్యాండర్ భారీ సిక్సర్లు కొడుతూ మ్యాచ్‌ను మలుపు తిప్పుతున్నాడు. గుజరాత్ టైటాన్స్‌పై ఇంప్యాక్ట్ సబ్‌గా ఆడిన అశుతోష్ 17 బంతుల్లోనే 31 రన్స్‌తో జట్టుకు ఒంటిచేత్తే విజయాన్ని అందించాడు. ఆ తర్వాత హైదరాబాద్‌పై 15 బంతుల్లో 33 నాటౌట్, రాజస్థాన్‌పై 16 బంతుల్లో 31 పరుగులు చేసి పంజాబ్‌ను గెలిపించినంత పనిచేశాడు.

**28 బంతుల్లోనే 61**

ఇక గురువారం ముంబై ఇండియన్స్‌పై అశుతోష్ విధ్వంసమే సృష్టించాడు. 77 పరుగులకే 6 వికెట్లు పడిన వేళ క్రీజులోకి వచ్చిన అతడు సిక్సర్ల మోతతో అలరించాడు. బుమ్రా, గెరాల్డ్ కొయెట్జీలను ఉతికారేస్తూ.. 28 బంతుల్లోనే 61 పరుగులు బాది పంజాబ్‌ను గెలుపు వాకిట నిలిపాడు. అశుతోష్ మెరుపు బ్యాటింగ్ చూసిన మిస్టర్ 360 సూర్యకుమార్ సైతం 'భలే ఆడావ్' అంటూ కితాబిచ్చాడు. ఇంకేముందు ఈ పంజాబ్ స్టార్ త్వరలోనే టీమిండియా జెర్సీ వేసుకోవడం పక్కా అని మాజీ క్రికెటర్లు అభిప్రాయపడుతున్నారు. జూన్ 1న మొదలయ్యే పొట్టి ప్రపంచకప్ పోటీలకు సెలెక్టర్లు ఐపీఎల్ మధ్యలోనే భారత బృందాన్ని ప్రకటించే చాన్స్ ఉంది.

## హార్దిక్‌పై గుర్రుగా ఉన్న నబీ..





హార్దిక్ పాండ్యా కెప్టెన్సీపై సొంత జట్టు అభిమానులే కాక సహచర ఆటగాళ్లు సైతం అసంతృప్తిగా ఉన్నారన్న విషయం మరోసారి బహిర్గతమైంది. దిగ్గజాలు కల్పించుకోవడంతో అభిమానులు కాస్త మెత్తపడినా.. సహచరులు మాత్రం హార్దిక్ తీరును ఎండగడుతూనే ఉన్నారు. రోహిత్, బుమ్రా, సూర్యకుమార్ లాంటి సీనియర్లు గతంలో పలుమార్లు తమ అసంతృప్తిని వెల్లగక్కగా.. తాజాగా మరో సీనియర్ వీరి సరసన చేరాడు. స్టార్ ఆల్‌రౌండర్ మొహమ్మద్ నబీ (ఆఫ్ఘనిస్తాన్) నిన్న పంజాబ్‌తో మ్యాచ్ పూర్తయిన అనంతరం తన ఇన్‌స్టా స్టోరీలో ఓ పోస్ట్ చేశాడు. ఈ పోస్ట్ నబీ అభిమాని పోస్ట్ చేసింది. దాన్నే నబీ తన పోస్ట్‌గా యాడ్ చేశాడు. ఇంతకీ ఆ పోస్ట్‌లో ఏముందంటే.. మీ కెప్టెన్ (ముంబై ఇండియన్స్) తీసుకునే కొన్ని నిర్ణయాలు చాలా వింతగా, ఆశ్చర్యకరంగా ఉంటాయి. నేటి మ్యాచ్‌లో నబీ బౌలింగ్ చేయలేదు. అయినా గేమ్ ఛేంజర్ అయిన నబీ కీలక సమయంలో రెండు క్యాచ్‌లు, ఓ రనౌట్ చేసి ముంబై గెలుపులో కీలకపాత్ర పోషించాడని నబీ అభిమాని హార్దిక్ కెప్టెన్సీపై అసంతృప్తిని వెల్లగక్కాడు. ఇదే పోస్ట్‌ను నబీ కూడా తన ఇన్‌స్టా స్టోరీలో పెట్టుకుని పరోక్షంగా తన అభిమానికి మద్దతు తెలిపాడు. నబీ.. హార్దిక్ కెప్టెన్సీపై అసంతృప్తిని నేరుగా బయటపెట్టనప్పటికీ పరోక్షంగా తనలో భావాన్ని వ్యక్త పరిచాడు. ఈ పోస్ట్ ప్రస్తుతం సోషల్‌మీడియాలో వైరలవుతుంది. ముంబై ఇండియన్స్‌లో చాలామంది సీనియర్ల లాగే నబీ కూడా అసంతృప్తిగా ఉన్నాడంటూ నెటిజన్లు చర్చించుకుంటున్నారు. కొందరు నబీకి మద్దతుగా నిలుస్తూ.. హార్దిక్ కెప్టెన్సీ నిర్ణయాలను తప్పుబడుతున్నారు. ఈ విషయం పక్కన పెడితే.. పంజాబ్‌తో మ్యాచ్‌లో హార్దిక్ ఆఖరి ఓవర్లలో అద్భుతంగా కెప్టెన్సీ చేయడమే కాకుండా వ్యక్తిగతంగానూ రాణించి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఛేదనలో 19వ ఓవర్ వేసిన హార్దిక్ 11 పరుగులిచ్చి అప్పటికి కీలకమైన హర్‌ప్రీత్ బ్రార్ వికెట్ పడగొట్టాడు. ఒకవేళ హార్దిక్ ప్రయోగం (బౌలింగ్ చేయడం) బెడిసికొట్టుంటే అతని మెడపై పెద్ద కత్తి వేలాడేది. అంతిమింగా ఈ మ్యాచ్‌లో ముంబై గెలవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

# స్పోర్ట్స్

## టీమిండియా కెప్టెన్‌గా రిషబ్ పంత్.. సిక్సర్ల కింగ్‌లు ఎంట్రీ!?




ఈ ఏడాది జూన్‌లో అమెరికా, వెస్టిండీస్‌ల వేదికగా జరగనున్న టీ20 వరల్డ్‌కప్-2024 అనంతరం భారత జట్టు జింబాబ్వే పర్యటనకు వెళ్లనుంది. ఈ టూర్‌లో భాగంగా టీమిండియా ఆతిథ్య జింబాబ్వేతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తలపడనుంది. ఈ సిరీస్ జూలై 6న ప్రారంభమై అదే నెల 14న ముగియనుంది. ఈ సిరీస్‌లో అన్ని మ్యాచ్‌లు హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగానే జరగనున్నాయి. అయితే ఈ జింబాబ్వే పర్యటనకు భారత తృతీయ ?శ్రేణి జట్టును బీసీసీఐ పంపించే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. టీ20 వరల్డ్‌కప్‌లో భాగమయ్యే ఒకరిద్దరూ మినహా మిగతా భారత ఆటగాళ్లందరికి ఈ సిరీస్‌కు విశ్రాంతి ఇవ్వనున్నట్లు సమాచారం. అంతేకాకుండా గాయం నుంచి కోలుకుని రీ ఎంట్రీలో అదరగొడుతున్న వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్‌కు ఈ సిరీస్‌లో భారత జట్టు పగ్గాలు అప్పగించాలని అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ యోచిస్తుందంట. కాగా పంత్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. పునరాగమనంలో కెప్టెన్‌గానే కాకుండా వ్యక్తిగత ప్రదర్శన పరంగా కూడా సత్తాచాటుతున్నాడు. ఇప్పటివరకు 7 మ్యాచ్‌లు ఆడిన పంత్ 210 పరుగులు చేశాడు. మరోవైపు ఐపీఎల్-2024లో దుమ్ములేపుతున్న రియాన్ పరాగ్, శశాంక్ సింగ్, అశుతోష్ శర్మ, సాయిసుదర్శన్, అభిషేక్ శర్మ వంటి యువ ఆటగాళ్లను ఈ సిరీస్‌కు ఎంపిక చేయనున్నట్లు పలు రిపోర్టులు పేర్కొంటున్నాయి. వీరితో పాటు రుతురాజ్ గైక్వాడ్, సంజూ శాంసన్, శివమ్ దూబే, అర్ష్‌దీప్ సింగ్, ముఖేష్ కుమార్ వంటి స్టార్ ఆటగాళ్లను సైతం జింబాబ్వే టూర్‌కు పంపించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.



# శర్వానంద్, కృతీ శెట్టి కొత్త సినిమా టీజర్ విడుదల


శర్వానంద్, కృతీ శెట్టి జంటగా శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న చిత్రానికి 'మనమే'. శర్వానంద్ 35వ సినిమాగా విడుదలకు సిద్దంగా ఉంది. లండన్ నేపథ్యంలో, కొత్తతరం ప్రేమకథతో ఈ చిత్రం తెరకెక్కుతుంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై వస్తున్న ఈ చిత్రంలో బాలనటుడు విక్రమ్ ఆదిత్య కీలక పాత్ర పోషిస్తున్నాడు. తాజాగా విడుదలైన టీజర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. శర్వానంద్, కృతీ శెట్టి ఈ చత్రంలో భార్యాభర్తలుగా నటించినట్లు తెలుస్తోంది. వారిద్దరి కుమారుడిగా విక్రమ్ ఆదిత్య ఉన్నాడు. టీజీర్‌లో చాలా ముద్దుగా కనిపిస్తున్న ఆ బాబుకు ఎవరైనా ఫిదా కావాల్సిందే. శమంతకమణి, దేవదాస్,భలే మంచి రోజు వంటి చిత్రాలను డైరెక్ట్ చేసిన శ్రీరామ్ ఆదిత్య 'మనమే' చిత్రంతో ఈ సమ్మర్‌లో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. మనమే చిత్రం తర్వాత శర్వానంద్ మరో రెండు చిత్రాలను లైన్‌లో పెట్టారు. అభిలాష్ కంకర దర్శకత్వంలో మాళవికా నాయర్ హీరోయిన్‌గా తన 36వ సినిమాగా రానుంది. రామ్ అబ్బరాజు దర్శకత్వంలో ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ పతాకాలపై అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నుంచి 37వ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఇలా వరుస సినిమాలతో శర్వా బిజీగా ఉన్నారు.



# కృష్ణ ఫ్రమ్ బృందావనంతో ఆది సాయికుమార్

ఆది సాయి కుమార్ హీరోగా వీరభద్రమ్ చౌదరి దర్శకత్వంలో 'కృష్ణ ఫ్రమ్ బృందావనం' టైటిల్‌తో ఓ సినిమా తెరకెక్కుతోంది. లక్ష్మీ ప్రసన్న ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తూము నరసింహా, జామి శ్రీనివాసరావు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గురువారం ఈ చిత్ర ప్రారంభకార్యక్రమాన్ని నిర్వహించారు. దిల్ రాజు, అనిల్ రావిపూడి, సాయి కుమార్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముహూర్తపు షాట్‌కు దిల్ రాజు క్లాప్ కొట్టగా.. ఫస్ట్ షాట్‌కు అనిల్ రావిపూడి గౌరవ దర్శకత్వం వహించారు. స్క్రిప్ట్ అందజేస్తూ సాయి కుమార్ కెమెరా స్విచ్ ఆన్ చేశారు. 'ఇన్ని రోజులకు మంచి కథ, స్క్రిప్ట్ దొరికింది. కుటుంబమంతా కలిసి చూసి నవ్వుకునే మంచి ఎంటర్‌టైన్‌మెంట్ చిత్రమిది. జూన్ నుంచి షూటింగ్ స్టార్ట్ చేయబోతున్నాం. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను వెల్లడిస్తామ'ని ఆది సాయికుమార్ తెలిపారు.






# దేవరను బీట్ చేసిన గేమ్ ఛేంజర్

ఆర్ఆర్ఆర్ సినిమాతో గ్లోబల్ బాక్సాఫీస్‌ను షేక్ చేశారు టాలీవుడ్ స్టార్ హీరోలు రాంచరణ్, జూనియర్ ఎన్టీఆర్. ఈ ఇద్దరూ ప్రస్తుతం పాన్ ఇండియా ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారని తెలిసిందే. రాంచరణ్ నటిస్తున్న చిత్రం గేమ్ ఛేంజర్. మరోవైపు ఎన్టీఆర్ నటిస్తోన్న ప్రాజెక్ట్ దేవర. ఈ సినిమాల థియాట్రికల్ రైట్స్‌కు సంబంధించిన వార్త ఒకటి ఇప్పుడు ఫిలింనగర్ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. అల్లు అర్జున్ పుష్ప 2 నార్తిండియన్ థియాట్రికల్ రైట్స్ విషయంలో ఆల్‌టైమ్ రికార్డును నమోదు చేసిందని తెలిసిందే. ఇక ప్రభాస్ నటిస్తోన్న కల్కి 2898 ఏడీ హిందీ హక్కులు కూడా భారీ మొత్తంలో రూ.100 కోట్లకు అమ్ముడుపోయాయి. ఇక ఇప్పుడు రాంచరణ్ టైటిల్ రోల్ పోషిస్తోన్న గేమ్ ఛేంజర్ వార్తల్లో నిలిచింది. హిందీ థియాట్రికల్ రైట్స్ లో జూనియర్ ఎన్టీఆర్ దేవరను బీట్ చేసిందన్న వార్త బీటౌన్‌లో హల్ చల్ చేస్తోంది. తాజా టాక్ ప్రకారం గేమ్‌ఛేంజర్ హిందీ థియాట్రికల్ రైట్స్ ద్వారా రూ.75 కోట్లు రాబట్టడంతో.. ఈ ఫిగర్ దేవర రైట్స్‌ను (రూ.50 కోట్లు) ను దాటిపోయింది. కాగా %===% ద్వారా నార్త్ ఇండియన్ ప్రేక్షకులలో సూపర్ క్రేజ్ సంపాదించిన రామ్ చరణ్, ఎన్టీఆర్.. మరి హిందీ బెల్ట్‌లో గేమ్ ఛేంజర్, దేవర సినిమాల విషయంలో ఎలాంటి పోటీ చూపిస్తారో చూడాలంటున్నారు సినీ జనాలు. పై నాలుగు సినిమాల హక్కులను పాపులర్ డిస్ట్రిబ్యూటర్, నిర్మాత అనిల్ తడని సొంతం చేసుకోవడం విశేషం. శంకర్ దర్శకత్వంలో పొలిటికల్ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కుతున్న గేమ్ ఛేంజర్ మూవీలో బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ ఫీమేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న దేవరలో బాలీవుడ్ భామ జాన్వీకపూర్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. జాన్వీకపూర్‌కు ఇది టాలీవుడ్ డెబ్యూ ప్రాజెక్ట్ కావడం విశేషం.

# కార్తికేయ 'భజే వాయు వేగం' టీజర్ టైం ఫిక్స్

ఆర్ ఎక్స్ 100 ఫేమ్ కార్తికేయ నటిస్తున్న తాజా చిత్రం 'భజే వాయు వేగం' యూవీ క్రియేషన్స్‌లో వస్తున్న ఈ సినిమాకు ప్రశాంత్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి మేకర్స్ మోషన్ పోస్టర్ వీడియో విడుదల చేసిన విషయం తెలిసిందే. స్పీడుగా దూసుకుపోయే కారు, డిక్కీలో డబ్బుల మూటలతో ఫుల్ యాక్షన్ ప్యాక్‌డ్‌గా సాగింది ఈ వీడియో. ఇప్పుడు తాజాగా మూవీ నుంచి టీజర్ అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ సినిమా టీజర్‌ను రేపు మధ్యాహ్నం 2.25 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. ఇక ఈ సినిమాలో కార్తికేయ సరసన ఐశ్వర్య మీనన్ కథానాయికగా నటిస్తోంది. రాహుల్ టైసన్, తనికెళ్ల భరణి, రవిశంకర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి రథన్ సంగీతాన్ని అందిస్తున్నారు. షూటింగ్ కూడా పూర్తయ్యింది. త్వరలోనే విడుదల తేదీని అనౌన్స్ చేయనున్నారు మేకర్స్.





# ప్రతీకారం తీర్చుకోడానికి వస్తున్న సత్యదేవ్

హీరో సత్యదేవ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'కృష్ణమ్మ' ఈ సినిమాకు వి.వి.గోపాల కృష్ణ దర్శకత్వం వహిస్తున్నాడు. అరుణాచల క్రియేషన్స్ బ్యానర్‌లో వస్తున్న ఈ సినిమాను కృష్ణ కొమ్మలపాటి నిర్మిస్తుండగా.. టాలీవుడ్ స్టార్ దర్శకుడు కొరటాల శివ సమర్పిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి టీజర్‌తో పాటు ఫస్ట్ సింగిల్ విడుదల చేయగా.. ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ సెకండ్ సింగిల్ విడుదల చేశారు. థీమ్ ఆఫ్ వెంజెన్స్ అనే పేరుతో సాంగ్ విడుదల చేసింది చిత్రయూనిట్. చూపుల్లో శూన్యం సుడిలో హృదయం పైపైనే మౌనం ఎదలో మథనం అంటూ సాగిన ఈ పాట చూస్తే ప్రతీకారం తీర్చుకోడానికి పగతో ఎదురుచూస్తున్నట్లుగా ఉంది.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com